

# నియంత చివరిదినాలు

పేరు మోసిన హాస్యనటుడు ఛార్లీ చాప్లిన్, ''ది గ్రేట్ డిక్టేటర్'' అనే వ్యంగ్య చిత్రం హాస్యాయుతమైనది తీశాడు. చాలా బావుండటమే గాక భావగర్భితంగా వున్న ఆ చిత్రం నియంతగా మారిన హిట్లర్ వుండగానే తీశాడుట. జర్మన్స్ నియంతతో అన్నారట. ''మీ మీద చిత్రం తీస్తున్నాడట చాప్లిన్''. నియంత నవ్వి వూరుకున్నాడట. అప్పటికి హిట్లర్ మహాశయుడు గెలుపే తప్ప ఓటమి యెరుగక, ఆగేబధ్ అనే స్లోగన్‌తో నియంత అని పేరుబడ్డాడు. మహాశయుడు మొదటి ప్రపంచ సంగ్రామంలో ఒక కార్పోరల్‌ట అంతే. తెచ్చి అందలంలో పెడితే అధికారం హస్తగతం చేసుకున్నాడు. మహాశయుడు గెలుస్తూ పోతుంటే చాప్లిన్, ''వీడెవరు? నన్నునుకరిస్తూ గొప్పవాడని పించుకుంటున్నాడు'' అని తీసేసినట్టు మాట్లాడాడుట. కాని మహాశయుడు మాస్కో దాపులకి చేరగలిగి, దానిని నేలమట్టం చేసి కృత్రిమ చెరువు సృష్టిస్తానని గర్జిస్తుంటే, ''అబ్బో! మాస్కో చేరగలిగాడే! గొప్పవాడే!'' అనుకున్నాడట.

ఫిలాసఫర్సేమో ''అలా పేట్రేగి బొబ్బలు పెడుతున్నాడుగానీ, రాక్షసత్త్వం గెలిచినట్టెక్కడా దాఖలాలు లేవు. నియంతకేమో మాట నిలకడలేదు. నిజాయతీ లేదు. యుద్ధ నీతినీ పాటించటం లేదు. సైనికులచే ప్రేమించబడి గౌరవించబడిన జనరల్స్‌ని చంపించాడు. మేనకోడల్ని కల్లాకపటం తెలియని దాన్ని చంపించాడని ప్రతీతి. నెపోలియను నుంచి గుణపాఠం నేర్వలేదు. శిశిరం అతి క్రూరంగా తన ప్రతాపం చూపుతుంది, జాగ్రఫీ డిఫీటెడ్ నెపోలియన్ అన్నారు పర్యావరణ శాస్త్రజ్ఞులు. నియంత చరిత్ర చదవలేదేమో. ఓడిన శత్రువులు ఒక్కుమ్మడిగా నాల్గువైపుల నించీ, వీడి నెదుర్కొంటారు. వారికి నూతన తాజా యుద్ధ సామాగ్రీ, తర్ఫీదివ్వబడిన సైనికులు, ఔషధాలూ, శిశిరంలో కాపాడే దుస్తులూ, ఆహార పదార్థాలూ పుష్కలంగా వుంటాయి అందుబాటులో. ఈ నియంతకానాటికన్నీ కరవై, టపాసులైపోయినట్లు యుద్ధసామాగ్రీ అయిపోయి యెదుర్కొనే తాహతు

లేక ఓడిపోతాడు తప్పదు'' అన్నారట. అదే జరిగింది. యెంతయినా జోస్యం చెప్పింది మేధావులు గదా.

ఔరంగజేబ్‌ని తీసుకుంటే, యిస్లామ్ వ్యాపింపజేస్తున్నానంటూ, సామ్రాజ్య విస్తీర్ణం చేసిన మాట నిజమే. దక్కన్‌లో కావేరీ నదివరకూ మొఘల్ సామ్రాజ్యం విస్తరింపజేశాడు గానీ, కుత్సితమూ, క్రూరత్వమూ మితిమీరి చివరికి దుష్ఫలితాలని చూపించాయి. తొంభైయేళ్ళు బతికి చూసినదేమనగా, తిరుగుబాట్లు, సామ్రాజ్య విచ్ఛిత్తి, నమ్మకస్తులు లేకపోవటం.

గెలుచుకున్న భూములన్నీ కోల్పోయి, స్వజాతీయులనే చంపిస్తూ ''ద్రోహు''లని తిట్టాడు నియంత. రేపు చావబోతూ ఏవా అనే అమ్మాయిని పెళ్లాడాడు. క్రేజీ అన్నారు. ''నేను పట్టుబడను. నన్ను పంజరంలో వుంచి వీధీ వీధీ తిప్పుతూ ''వీడే హిట్లర్'' అని వింతజంతువును చూపించినట్టు చూపిస్తారు'' అనటమే కాక యేవా పిల్లల్ని కనగూడదన్నాడు. ''వీడే హిట్లరు కొడుకు'' అని పట్టుకుంటారన్నాడు.

మనమధ్య హిట్లరైట్స్ వున్నారు. వుంటారు. గమనిస్తే కనబడతారు. వింతేమిటంటే యీ హిట్లరైట్సూ మొదట్లో నెగ్గుతూ, గెలుస్తూ, తమ మాటే నెగ్గించుకుంటూ పోతారు అచ్చం హిస్టారికల్ నియంతలాగే. అంతిమ విజయం తమదే అనుకుంటూ మాయలో వుంటారు. కాని నియంతకొచ్చిన పరిస్థితులూ రోజులూ తమకూ వస్తాయని వూహించరు. తీరా వస్తే ఆశ్చర్యపోతారంతే.

మృత్యువును జయించాననుకున్న హిరణ్యకశిపుడే, నరసింహుని జూచి ''కేవల నరరూపము గాదు, కేవల మృగరూపము గాదు. నన్ను చంపటానికే వచ్చాడు'' అనుకున్నాడట. కాని జీవితేచ్ఛ పోలేదు. ''నన్ను చంపలేవు'' అన్నాడట. నరహరి, ''చూతాము నీ వరాలు నిన్ను మృత్యువునుండి కాపాడుతాయేమో'' అన్నాడట. కాపాడనే లేదు వరాలు. రాత్రిగాదు పగలు గాదు అసుర సంధ్య. పైనగాదు కిందగాదు స్తంభం పగిలిన మధ్య ప్రదేశం. ఆయుధాలు గావవి గోళ్లు. ఇంటి వెనుకా గాదు ముందూ గాదు. హాలులో

మధ్యలో అది భవనం మధ్య భాగం. అదీ వింత. అన్నిటినీ అధిగమించి మింగేసింది మృత్యువు.

చాలావరకు దుష్కార్యాలకు దుష్ఫలితాలుండవనే నమ్ముతాము. అదే వింత.

దుర్గాంబ, రాగతనం, నోటిదురుసూ, శరీరదారుఢ్యం చూస్తూ వచ్చిన అమ్మలక్కలు, చదువుకున్నవారు గూడా దుర్గాంబను ''హిట్లరైట్'' అన్నారు.

సామాన్య గృహిణే. గడ్డు రోజులు చూసిన మనిషే. కాలం కర్మా కలిసి వచ్చి దుర్గాంబకు హోదానిచ్చాయి. మనిషి వంక మహలక్ష్మి తీరుస్తుందిట అలాగా, యింట్లోని వారూ బయటివారూ వెరవసాగారు. పూసుకుతిరగటం, ముఖప్రీతి మాటలూ, మెరమెచ్చులూ సాగాయి. బందుగులు నేర్పుగా తమ పన్లు ఆమె ద్వారా నెరవేర్చుకోసాగారు.

కూతురుకి ఆస్తిపరుల సంబంధం కలిసివచ్చింది. కొడుకులు పెద్ద చదువులు చదివారు. పట్టు చీరలే కట్టింది. భర్త స్వంత వ్యవసాయం. కాయకష్టం చేసి భూములు రెట్టింపు చేశాడు. రంభవంటి కోడలొచ్చింది. దుర్గాంబ మనమడి నెత్తుకున్నది. స్వర్ణయుగం చూసింది దుర్గాంబ.

ఈజీ విక్టరీస్‌తో హిట్లర్ తల తిరిగిపోయిందిట. ఫ్రాన్సూ త్రాహి త్రాహి అన్నది.

దుర్గాంబ తల తిప్పేసింది స్వర్ణయుగం. డాబూ దర్పం, ఇగో పెరిగి వాస్తవం చూడనీయలేదు. ముందుచూపూ లేదు. నిజానిజాలు తెలుసుకునే సామర్థ్యం పోయింది. బాణుడనే కవి చమత్కరించాడు. లక్ష్మి దేవికి తోడబుట్టిన వాళ్ల పోలికలున్నాయిట. విషం, చంద్రుడు, కల్పవృక్షం, ఐరావతం, ఉచ్చైశ్రవం, అప్సరసలు వీరూ తోడబుట్టినవారు. డబ్బెంత ఆనందమిస్తుందో చంద్రుడల్లే, విషమల్లే అంత హానీ చేస్తుందిట. అహం పెంచుతుంది. ఆమె వాక్కు వేదవాక్కయితే స్వర్ణయుగం శాశ్వతమనుకున్నది దుర్గాంబ.

హిట్లర్ థర్డ్ 'రీ' తేవాలని ఆశిస్తూ యుద్ధం బిగిన్ చేశాడు. దైవమొకడున్నాడని మరిచి, సైన్సే దైవం అనుకున్నాడు. విషవాయువులతో

అనార్యులను తుడిచివేయగల ననుకున్నాడు. మృత్యువాహనాలు కనిబెట్టించాడు. వెర్రి వేయి విధాలు. మహా మహా అలెగ్జాండరే జగజ్జేత అనిపించుకోవాలని, లక్ష సైన్యంతో పురోగమిస్తున్నవాడే తిరోగమించాల్సి వచ్చింది. యుద్ధ నీతి పాటించలేదు. సాహసిననుకుంటూ తుఫానులో రాత్రిపూట జీలమ్ నది దాటి పురుషోత్తముని సైన్య స్థావరం మీదికి దాడి చేశాడు. వాన రాత్రి, బురద నేల, యెవరు శత్రువో యెవరు మిత్రులో తెలుసుకోలేక తమవారినే తొక్కి చంపినై యేనుగులు. యాభైవేల సైన్యంతో యెదుర్కొన్న పురుషోత్తముడు పట్టుబడ్డాడు.

పురుషోత్తముడు నిలబడి వున్నాడు. దీనుడుగాలేడు. ధీరుని లాగే నిలబడ్డాడు. అలెగ్జాండర్ సింహాసనం దిగి నిలబడి ''నిన్నెట్లు చూడమందువు?'' అని అడిగాడు.

''సాటి రాజువలె'' అని జవాబిచ్చాడు పురుషోత్తముడు.

ఆ అక్షరాలను శిలాక్షరాలుగా చెక్కించాడు అలెగ్జాండర్.

''రాత్రి పూట తుఫానులో దాడిచేయమని యుద్ధనీతి చెప్తున్నదా? అది వీరులు చేసే పనా? నీవు వెనుదిరిగి వెళ్లాలి. ముందుకెళ్లలేవు. దట్టమైన అడవులు. మృగాలు, కీటకాలు, విషసర్పాలు దోవతెన్నూ తెలియవు. సైన్యం హతమౌతుంది. వెనుదిరిగి వెళ్లటమే శ్రేయస్కరం'' అలెగ్జాండర్ సైన్యమూ ముందుకు పోవ మొరాయించింది.

అలాగే రోమెల్ అనే జనరల్, నియంతకీ మంచి సలహా యిచ్చాడు '' ఆటే సైన్య నష్టం కలక్కుండా కోల్పోయిన కాలనీలన్నీ గెలుచుకున్నాము. యుద్ధ సామాగ్రీ అయిపోయింది. ఇపుడు సంధిచేసుకుంటే గౌరవంగా వుంటుంది. మొదలు పెట్టింది మనమే. ఆశయం నెరవేరింది. గెలిచాము''.

కాని నియంతృత్త్వం విషంలాగా పనిచేసింది. ''పీస్ విథౌట్ విక్టరీ'' అన్నవారి తల తీయిస్తా అని అంకెవేశాడుట నియంత. అసూయాగ్రస్తులైన కోలీగ్స్ రోమెల్ మీద నేరాలు చెప్పారు నియంతతో.

''మంచి చెప్తే వినటం లేదు. పవర్ క్రేజీ. వాడిని దింపేయాలి. వాడికి స్వదేశం మీదా లేదు. స్వజాతి మీదా లేదు. థర్డ్‌రీ తెస్తాననటం మోసం'' అంటున్నాడు.

''సైనైడ్ మింగిపోతే యుద్ధంలో పోయాడని ప్రకటిస్తాము. ఆ పని చేయకపోతే మొత్తం కుటుంబాన్ని తుడిచేస్తాం'' అని కబురుపెట్టాడు నియంత. రోమెల్ ''కుందేటి కొమ్ము సాధింపవచ్చు చేరి మూర్ఖుల మనసు రంజింపలేము'' అనుకుని వుండాలి. సైనైడ్‌కే మొగ్గు చూపాడు.

గురుపుత్రుడశ్వత్థామ, దుర్యోధనుడు తొడలు విరిగి కిందబడి చనిపోతూ ''భీముడధర్మ యుద్ధం చేశాడు. కృష్ణుడు ధర్మజుడు వున్నారు'' అని చెప్తూ గురుపుత్రుని సర్వసైన్యాధిపతిని చేస్తే యిగో పెరిగి, ఆవేశపడి, ''అపాండవం చేస్తాను రాజరాజా'' అని లేచాడు. వివేకం కోల్పోయిన గురుపుత్రుని కృపాచార్యుడు చూచాడు. ''యెంత తెలివి తక్కువ గురుపుత్రా! దుర్యోధనుడు సత్యం పల్కాడు. కృష్ణపరమాత్మ వుండగా నీవా పని చేయలేవు. నేనిక నీతో వుండలేను. వెళ్లిపోతున్నాను'' అని వెళ్లిపోయాడు.

అశ్వద్ధామ, రాజరాజును సంతోషపెట్టాలనీ, మాట నిలుపుకోవాలనీ బ్రహ్మ శిరోనామకాస్త్రం వదులుతూ, అపాండవమగుగాక అనేగాక పాండవీయ రాగవీయ అని గూడా అన్నాడు.

అలాగే ప్రజాభిమానం, సైన్య అభిమానం గూడా కోల్పోయాడు నియంత. ఉక్రోషంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సైన్యం గూడా తిరుగుబాటు చేయగా అలెగ్జాండర్ వెనుదిరిగి బాబిలోనియా మీదుగా వెళ్తూ సముద్రమార్గాన ప్రయాణిస్తూ పోయాడు.

కరవూ, కాటకం, ఆర్థిక మాంద్యం, అంటువ్యాధులూ వచ్చి, పరపాలనలో మగ్గుతూ, దుర్భిక్షంగూడా చూసింది భారతమాత. ఆనాడు భారతదేశ సగటు వయఃపరిమితి ఇరవై ఒకటి. సెకండ్ రీ కోల్పోయిన జర్మనీ గూడా అలాగే వున్నది. జనాభా పడిపోతున్నది. అంటు వ్యాధులు జనాభాను తుడిచేస్తున్నాయి. మంచి

ఔషధాలూ లేవు. మంచి తిండీ లేదు. పశువుల గతీ అంతే.

యెక్కడ చూసినా దారిద్ర్యము, ఆకలీ, నిరుద్యోగ సమస్యా కంటబడటమేగాక, అధికార పదవుల్లో యూదులను చూసిన హిట్లర్ గుండెలు మండిపోయాయట. థర్డ్‌రీ తేవాలని అనుకునేవాడు.

మొదటి ప్రపంచ సంగ్రామం ట్రీటీ ఆఫ్ వార్సెల్లీస్‌తో ముగిసింది. కాని ట్రీటీలో మోసం జరిగిందని ఓడినవారు బాధపడ్డారు. ఆ మోసానికీ, అవమానాలకీ, వ్యాపారం చేసుకోనీయకుండా హెచ్చు సుంకాలు చెల్లించాల్సి రావటం అణచబడి వుండటానికి రవులుకు పోయారు. దోపిడీ మొదలైనా, అణచబడినా యుద్ధం వచ్చి తీరుతుంది. పిల్లిని గదిలో వుంచి చావగొడితే అదీ పీకుతుంది. ఈస్ట్ పాకీస్తాన్ని దోచటం మొదలు పెట్టి వుర్దూ రాజభాషచేయాలనీ బోధనా దానిలోనే జరగాలనీ మొదలు పెట్టంగానే యుద్ధం రానే వచ్చి, బంగ్లాదేశ్ యేర్పడింది.

గడ్డు రోజులు చూసింది. క్రైసిస్ ఆఫ్టర్ క్రైసిస్ నెగ్గుకొచ్చిన మనిషి, అప్పులు తీరి, హోదా, బంగారం, అధికారం హస్తగతం కాగానే పవర్ క్రేజీ అయింది దుర్గాంబ. పురోగమిస్తూ థర్డ్‌రీ తేవాలనుకుంటున్న నియంత లాగే అయింది దుర్గాంబ. పిల్లనిస్తామని ఆమెచుట్టూ తిరుగుతున్న వారితో, ''చేసుకోము. మరో సంబంధం చూసుకోండి'' అని, కుండ పగలేసినట్టు చెప్తే కుటుంబ సభ్యులంతా నోళ్లవెళ్లబెట్టారు. వారికా మాచ్ అన్నివిధాలా నచ్చింది మరి.

వియ్యంకుడు కావాలని ఆశించిన పెద్దమనిషి, ''కారణం చెప్పాలి. నియంత స్టైల్ బాగా లేదు. మీకు మంత్రోపదేశం చేసిన గురూజీ గూడా అనుమతిస్తూ దీవించి, ''తాంబూలాలు పుచ్చుసుకోండి'' అన్నారు'' అన్నాడు నవ్వూ హాస్యం జోడించి. '' నా బిడ్డలో లోపమేమిటి?'' అన్నట్టున్నాదా ధోరణి. లబ్ధి పొందేవారు నవ్వుతూ హిట్లరైట్ అంటుంటే చివరికదే ఖాయపడింది.

పందొమ్మిది వందల ముప్ఫై తొమ్మిదిలో తారాజువ్వలాగా ఆకాశంలోకి యెగరటం మొదలెట్టిన హిట్లర్, పందొమ్మిది వందల నలభై అయిదులోనే, నేలపై

రాలటం మొదలైంది. కాని నేలకూలానని ఒప్పుకోలేదు. భ్రమలోనే వుండి ఆర్డర్లు యిస్తూనే వున్నాడు. ''దాపుల కొచ్చారు శత్రువులన్నా ''నమ్మక ద్రోహులు'' అని తిడ్తూ వంతెనలు కూల్చమనీ, కొంతమందిని షూట్‌చేయమనీ అంటూనే వున్నాడుట. నిలబడి వింటున్న ఆఫీసర్లు'' అమలు జరగుతున్నాయి మీ ఆర్డర్సు'' అనండి లేకపోతే కోపంలో, చంపేస్తాడు'' అని ఒకరికొకరు చెప్పుకున్నారట.

''శాఖా భేదమున్నది'' అన్నది దుర్గాంబ.

నియంతను గుర్తించాడు వియ్యంకుడు కాని వియ్యంకుడు పకాపక నవ్వుతూ ''అది చాలా చిన్నదన్నారు గురూజీ. మీ మనస్సులో యెవరి బిడ్డనో మీ రెండవ అబ్బాయికి చేసుకోవాలని నిశ్చయించుకున్నట్లున్నారు. అది వుద్యోగస్థులతో వియ్యమేమో. నేనొట్టి భూస్వామిని మర్యాదలు చెల్లించలేనని తలిచి వుండాలి. లాంఛనాలు తర్వాత యాడాది పొడుగునా మర్యాదలు పండగ పిలుపులు వుండవని అనుకుంటూ వుండాలి. పసుపు కుంకుమ, బారసాల మర్యాదలూ అనవాయితీలు వుండవని అనుకుని వుండవచ్చు. ఒక్కటి చూడండి, మీరెన్నిక చేసినమ్మాయి మీ మోచేతి నీళ్లు తాగుతూ, చాకిరీ చేస్తుందా? చూడాలి. ఈ కంటికీ రెప్పలు దూరంగావు'' అని నవ్వుతూనే తండ్రితోనూ అల్లుడు కావాలని ఆశించిన అబ్బాయితోనూ అన్నాడు.

''మోసమేదీ? డ్రాఫ్టు తెచ్చానిదిగో. అది బౌన్స్ అవుతుందని అనుమానమా? రొఖ్ఖమే యిస్తాను. నా సంబంధం మీ కంటికానటం లేదే! పోనీయండి. యోగం లేదని పోతున్నాను. విచారిస్తారు సుమా'' అని లేచి వుత్తరీయం దులిపి సరిగా వేసుకున్నాడు వెళ్లిపోయాడు పెద్దమనిషి.

ఫ్రాన్సు లొంగినప్పుడు నియంత గర్వించినట్లు గర్వించింది దుర్గాంబ. అక్కడున్న వారికీ అలాగే కనిపించింది.

## 2

దుర్గాంబ తోటికోడలు భ్రమరాంబ దుర్గ స్టైల్ గమనిస్తూనే వున్నది.

యేమని పేరుబడిందో గూడా తెలుసు. భ్రమరాంబ భర్త సన్నిపాతం తాకిపోయాక భాగాలు పంచుకున్నారు. పక్కభాగంలో వున్న భ్రమరాంబ చనవుగానూ, స్నేహంగానూ వుండటమే గాక అవసరానికి ఆదుకుంటూనే వచ్చిందిన్నాళ్లూ. మాట నేర్పరి, పొదుపరి. పుట్టిల్లు కృష్ణాజిల్లా బందరు.

''దుర్గా! నచ్చిన సంబంధాలు వచ్చినట్టు తిరిగిపోతున్నాయి. యెవరిమీద ఆశలు పెంచుకుంటున్నావూ? నాకు చెప్పవూ? నేనెవరితోనూ అననులే. ఆసూయ అసలే లేదు''.

మధ్యాహ్నం భోజనాలై, చిన్న కునుకు తీయటం గూడా అయిపోయింది. మినుములు విసురుతున్నది భ్రమరాంబ. దుర్గాంబ సాయపడుతున్నది. తిరగలి పెద్దదే. పప్పులు స్వయంగా తయారు చేసుకోవటం అలవాటు. కందులూ పెసలూ గూడా బాగుచేసి విసిరి చాయపప్పు చేస్తుంది. పొట్టు గేదెకి కుడితిలో కలిపి చిక్కగా చేసి పెడుతుంది.

''తెలియనట్టడుగుతున్నావే అక్కా! నీదంతా చాతుర్యం చోద్యమూనూ. ఒకరి వంశంలో పిచ్చి కాన్సరూ వున్నాయని విన్నావు. అది తప్పినందుకు నువూ సంతోషించావు. మరోటి మరీ ఘోరం. పెళ్లయి యాడాది తిరక్కముందే పెళ్లి కూతురు విధవరాలు కావటం జరుగుతుంటే పెళ్లిళ్లు ఆపారుట. ఇంకో పిల్లకి రెండు కళ్లూ మెల్ల. పనీ పాటా రాదు. ''యెట్లా వచ్చారో పిల్లనిస్తామనీ'' అని నువే దవడలునొక్కుకున్నావు. అలాగే తక్కినవీను. నా నోటితో చెప్పించాలనా?'' అన్నది నవ్వుతూ. మా పిన్ని పెద్ద ఆస్తీ, పెద్ద చదువు పరాయి వారికి చెందకుండా తమ్ముడికి తన కూతుర్నిచ్చుకున్నది. అది కాన్పు కాకపోయింది. కొన్నాళ్లాగి మరో సంబంధం చేసుకోలేదని తన రెండో కూతుర్నిచ్చింది. దానికి కాన్పు ఆయాక పదిరోజుల లోపునే ధనుర్వాతం తీసికెళ్లింది. బిడ్డకి దీపపు పురుగు కుట్టి యిరవై ఒకటో రోజున ముగిసింది'' అన్నది విచారంగా.

''అదంతా నిజమేనందాము దుర్గా. నేను నీకు నచ్చిన సంబంధం పడగొడతానని వెరుస్తున్నావేమో'' అని నవ్వింది.

''నువ్వూ మేనగోడల్ని కోడలుగా తెచ్చుకున్నావు. నేనూ అంతే చేశాను పెద్ద కొడుక్కి. నిన్నూ కూచోబెట్టి చేయడం లేదు నీ మేనగోడలు. నా పని సరేసరి. కోడలికి దగ్గూ, ఫిట్సూ, దడా, అయాసం. నేనే దానికన్నీ చేయటం చూస్తూనే వున్నావుగా'' అని తల తాటించి, మూతి విరిచింది దుర్గాంబ.

'' ఈనాటిలాగే ఆనాడు ఆపేయలేకపోయావూ సంబంధం'' అని ధీర్ఘం తీసింది భ్రమరాంబ. మినుములు తిరగట్లో పోస్తున్నది. ''అనేదాకా రానిచ్చారా? అల్లుడిని పెద్ద చదువు చదివిస్తానన్నదట. మాటిచ్చాడట పిల్లతండ్రి. నీ మరిదికి పెద్ద చదువు మీదే గౌరవం నమ్మకమూనూ. స్వంత వ్యవసాయంలో యాడాది పొడుగునా ఒళ్లు విరుచుకున్నా, భూమి పండుతుందీ పండదు, ఫలసాయం యింటికి చెందకముందే ఖర్చు లెదురుచూస్తూ వుంటాయట. పెద్ద చదువంటే పట్నంలో వుంచి నెలనెలా డబ్బు పంపాలి. మన బంధువుల్లో చాలామంది అల్లుళ్లను చదివించి కూతురు సుఖపడేమార్గం వేశారు. వారిని చూసి నీ మరిది, పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్టు వియ్యంకుడిదే భారమంతా తన పని తేలికైందని పెళ్లి కానిచ్చేశాడు శీనప్పకి. అదే మొదలు. బావగారు యిల్లు మొదలెట్టిస్తే కలప కొని తలుపులూ ద్వారబంధాలూ కిటికీలు చేయిస్తుండగా, కన్ను కుట్టిన దాయాదులు కలప ముట్టించారు రాత్రిపూట. పట్టువీడక మళ్లా కలప కొని తెల్లార్లూ కాపలా కాస్తూ యిల్లు పూర్తి అయిందనిపించారు. అయిపోలా నష్టాలు. మెరుగుపెడ్తానని కంసాలి వస్తే ముగ్గురి నగలు మెరుగుపెట్టిస్తున్నాము. మధ్యాన్నం భోజన సమయంలో కన్నుగప్పి నగలతో పరారీ అయినాడు కంసాలి. దానికే డీలా పడితే పులిమీద పుట్రలాగా పిల్లనిచ్చినవాడు న్యుమోనియాతో తొమ్మిదో రోజు హరీ మన్నాడు. ఇంట్లో నాకు రోగిష్టి కోడలు మిగిలింది. చదువులు పూర్తి కావాలనే నిశ్చయంతో అన్నీ అమ్మేయటం సాగించారు నీ మరిది. రెండోవాడి చివరి పరీక్షకి నా పుస్తెలతాడూ, పుస్తెలూ, మురుగులూ జిగినీ వెళ్లిపోయినై మార్వాడీ దగ్గరకి. నల్లపూసల గొలుసు పాత పాత్రసామాను కంచుకుండ, కళాయి, గుండిగచెంబు, పెద్ద కాగు, కళాయి, అన్నీ నడిచిపోయాయి. అదంతా కోడలు పాదం పెట్టినప్పటినించే'' అని సోది

వెళ్లబోస్తుంటే భ్రమరాంబకి విసుగేసి, ''అసలు విషయం వదిలేసి పాత విషయాలు తవ్వి తలకెత్తుతున్నావే దుర్గా! అదీ గడుస్తనమంటే. నీవు పాదం పెట్టినప్పటి నించీ యీ యింటికి సిరియెత్తుకుని, కోడలు అడుగుపెట్టినప్పటినించీ దిగనాసిల్లామని చెప్తానే వున్నావుగా కొత్త విషయమేదీ?'' ఇంకాసిని మినుములు చాటలో వున్నాయి అవి గూడా విసిరేదాకా టైమున్నది. ఈ లోపల అసలు సంగతి బైటికి రావాలి. అదీ భ్రమరాంబ కోరేది. తిరగలి చుట్టూ మినప్పప్పు యెత్తుగా తయారైతే చేతితో దూరం చేసింది. యడమ చేయి పిడిని పట్టుకునే వున్నది. వదులైనట్టుంటే పక్కనే వున్న గుండ్రాయితో కొట్టింది పిడిమీద. తడిగుడ్డ పీలిక చుట్టి తిరగలి గుంటలో కొట్టింది. యెందుకు పిడివదులౌతుందీ అని చూసింది.

దుర్గాంబ నవ్వుతున్నది. ''పిడివదులుకాలేదక్కా. నీకన్నీ అనుమానం. బిగువుగానే వున్నది పిడి. టైమ్ గూడా పొదుపు చేయాలని నీ వుద్దేశం. నే తక్కువ తిన్నానా?''.

''అబ్బెబ్బే! నేనెందుకలా అంటాను? మూడవ సామ్రాజ్యం తేవాలని ఆశించిన నియంతవిగాదూ? నువ్వెక్కడ? నీకున్న అధికారం యే యిల్లాలికున్నదీ యీ చుట్టుపక్కలా? చెప్పకపోతే దాచుకో దుర్గా. నిజం దాగదు'' అన్నది విసురుతూ.

దుర్గాంబ మొహం చింకిచాటంత అయింది, ఆ పొగడ్తకి. పకాపక నవ్వింది. కొంగుతో కళ్లు అద్దుకున్నది.

''కథ మళ్లా మొదటి కొచ్చిందక్కా. పిల్ల నిస్తానని వచ్చినవాడు మిఠాయి పొట్లం చిటారు కొమ్మన చూపించాడుగానీ కనీసం పిల్లవంటి మీద యిన్ని తులాల బంగారముంచుతాను అనలేదు నాతో. పిల్లని చూసిపొండి అని ఛార్జీలు చేతబెట్టి, పిల్ల నచ్చిందనగానే, తక్కినవి సెటిల్ చేస్తా అన్నాడా! నాతో మాటే లేదసలు యెంతసేపూ తండ్రీకొడుకులతోనే బేరం. పోనీ కూతుర్నీ వూళ్లో బంధువులింట్లో వుంచి వచ్చి జట్కా అన్నా తెచ్చి రమ్మన్నాడా లేదు'' అని అంటుంటే అక్కసు వెళ్లగక్కుతున్నది దుర్గ అనుకున్నది భ్రమర. సరసానికి ''నీ కోరిక

కోటలేలుదామంటున్నదేమో దుర్గా. అది తెలుసుకో'' అన్నది.

''కోటలేలుదామనుకోటం తప్పా? చెప్పనీ మరి. నువే అడిగావు. అప్పుడే మరుపా. రొక్కం చేతులో పోస్తాననగానే యెగిరి గంతేసి చేసుకుంటామని మాటిచ్చేశారు. యేదీ మూట అనన్నా హాస్యమాడలేదు. రెడ్డొచ్చె మొదలాడమని, మొదటి వియ్యంకుడు పెద్ద చదువు చదివిస్తాననగానే సత్తెకాలం మనిషిలాగా పెళ్లి ముగించాడా, మాటిచ్చిన వాడు చచ్చి వూరుకున్నాడు. పోనీ కూతురు పేర నాలుగెకరాలు పెట్టి పోయాడా లేదు. దగా జరిగితే యేం చేయగలం?'' అంటూ గొంతు తగ్గించి నోటికి కుడి అరచేయి అడ్డం పెట్టి ''పిల్లయేమని పేరు బడిందంటే మాసకమ్మని. ఇరవైయేళ్లు నిండితే పధ్నాలుగే అని నమ్మిస్తున్నాడు తండ్రి. మెట్రిక్కు పాసైందిట. అదో గొప్ప పెళ్లి కానిచ్చి నానెత్తి మీదెక్కిస్తాడట మెట్రిక్ పాసైనానని కళ్లు నెత్తిన పెట్టుకుని వచ్చి దాష్టీకం చేస్తుంది. బోడి మెట్రిక్కేగా. యెమ్మేనా? డాక్టరా?'' అని తల విసురుతున్నది దుర్గ.

''పధ్నాలుగేళ్లకే డాక్టరెలా అవుతుందంటా?'' యింకా గుప్పెడు మినుములే వున్నాయి చాటలో. ''కానీ. కానీ దుర్గా. యిద్దరికీ మళ్లా పనీ'' అన్నది భ్రమరాంబ.

సంతోషంతో దుర్గ మనసుగంతులేసింది. కంటిన్యూ చేసింది. ''నా తమ్ముడి తోడల్లుడు డెప్యూటీ కలెక్టరు. ఒక్కతే కూతురు. రైలు ఖర్చులిచ్చి నా తమ్ముడిని పంపి, నన్ను తెమ్మంటే, పిల్లను చూడాలని నా తమ్ముడి వెంట వెళ్లాను. యెంత మర్యాదా. పిల్ల మాణిక్యమే. పేరూ అదే. తల్లికి పుట్టింటారు పెళ్లినాడు పెట్టిన నగలన్నీ పిల్లకే చెందుతాయి. పిల్ల వంటి మీదా బాలసొమ్ము అని పెట్టారు. యేబ్రాసి నివ్వరు. పద్దెనిమిదేళ్లు, బియె పాసైంది. భీమా కంపెనీలో జాబ్ యిస్తాం పంపమన్నారుట వియ్యంకుని స్నేహితులు. చాలా లాభాలుంటాయటా వుద్యోగంలో చేర్పిస్తే. చెప్పారు. పసుపు కుంకుమ కింద యిచ్చే రెండెకరాల భూమి రిజిష్టరయింది. కాగితాలు చూపారు. లాంఛనాలూ పండగ పిలుపులూ వుంటాయన్నారు. అన్నీ పాటిస్తామన్నారు. తండ్రి ఆస్తీ కూతురుకే చెందుతుంది.

దత్తు తలపెట్టారుట. పిల్లను తెచ్చి చాపమీద కూచో బెట్టారు. ఇరుగుపొరుగూ అమ్మలక్కలు వచ్చారు. వేడుక అవుతుంటే పిల్ల వంచిన తలెత్తనే లేదు. ఆ పూటకుండి రాత్రికి వెళ్లచ్చని చెపుతూ కలెక్టరూ భార్యా మరీ మరీ వత్తిడి చేశారు. నా గౌరవార్థం, నా తమ్ముడి గౌరవార్థం ఆ రాత్రికి యిరుగు పొరుగుని పిలిచి విందు యిచ్చారు. తిరిగి వచ్చే ఛార్జీలు తమ్ముడి కందించాడు కలెక్టరు. పిల్ల చేత నా పాదాలకి మొక్కించింది తల్లి. యేనాటి మర్యాదో అది. ‘‘ ఇవన్నీ యింకా పాటిస్తున్నారా’ అని నవ్వాను’’ అని మంగళం పాడింది దుర్గాంబ.

‘‘మాటిచ్చారా నీ తమ్ముడూ నువ్వూ? తాంబూలాలు పుచ్చుకోటానికి నా మరిది రావద్దూ? మీరు చెల్లించాల్సినవీ వున్నాయి. కనికట్టేమో. మాయ నగలేమో’’ అని గొణుగుతూ లేచింది భ్రమరాంబ. చాట దులిపి గోడకానించింది. దుర్గాంబకి ఆ గొణుగుడు వినబడింది.

‘‘తల్లివీ నకిలీ సొమ్మేనంటావా? పాత నగలవి. మొద్దులల్లే వున్నాయి. మురుగులూ మురిడీ గొలుసులూ, కంఠసరులూ’’ అని నవ్వుతూ లేచి కొంగు దోపుకుని వెళ్లిపోతూ,

‘‘ ఒక విధంగా మాటిచ్చినట్టే అక్కా. మాట నిలబెట్టుకోవాలి. వుద్యోగస్తులతో వ్యవహారం’’. గడపదాటి ‘‘తలుపేసుకో. కోడలు పుట్టింటికెళ్లిందై పాయె వాళ్లమ్మ లేవటం లేదని. ఒక్కత్తెవే యింట్లో’’ అని నిర్గమించింది దుర్గ.

3

నియంతసైన్యం యెదురు లేకపురోగమిస్తూ తమకెదురులేదని తలచారట. యెక్కడినించో శత్రుమూక మెరుపు దాడి చేస్తూ యెదురొస్తే, యుద్ధ సామాగ్రిలేక పీఛే ముడ్ అన్నట్లు తిరోగమించాల్సి వస్తే నివ్వెరపోయారుట. ఆర్డర్సు రావాలి. రానిదీ యేమీ చేసే వీలు లేదు.

‘‘లొంగ గూడదు. చివరి బొట్టు వరకు రక్తం ధారపోస్తూ ఊపిరున్నంత వరకూ పోరాడాల్సిందే’’ అన్నాడుట నియంత.

''యెడతెగని మంచులో వాహనాలు కూరుకుపోయాయి'' అని యిక్కట్టు తెలియజేస్తే ''విమానాల్లో మోకులు వస్తున్నాయి వాటి సాయంతో వాహనాలు మంచునుండి లాగండి'' అని జవాబు.

శత్రువులే దయతలిచి '' ఆయుధాలు కింద వుంచి, చేతులెత్తండి. మిమ్మల్ని మీ దేశం మేమే క్షేమంగా పంపుతాము'' అన్నారుట.

స్వంత దేశంలో ''వందల గజాల దూరంలో వున్నారు. శత్రువులు లొంగాము అనమని అనడిగితే, ''వీల్లేదు. మీరంతా ద్రోహులు మిమ్మల్నందర్నీ చంపిస్తా'' అన్నాడట. పోలిక వచ్చిందేమో. పరిస్థితి వికటించింది. తెగేదాకా లాగింది దుర్గాంబ. ''నిజాయితీ ఋజువుచేసినా ఒప్పుదల రావటం లేదే హిట్లరైట్ మాతనుంచి?'' అనుకున్నాడు రెండవ సేనాని కుమార రత్నం. పేరూ అదే కుమారస్వామి. మగతనం, మగసిరి, నియంత కొడుకేగా మరి పైకి వచ్చింది.

భీష్మ ప్రతిజ్ఞ చేశాడు ''చూడమ్మా మూర్ఖత్వం చూపుతూ నిక్‌నేమ్ నిజం చేస్తూ థర్డ్‌రీ వచ్చేస్తున్నదని వూహిస్తున్నావేమో! నియంతకి ఓటమి ఖాయం. యీ సంబంధం తిప్పేశావంటే నా పెళ్లే చూడవు. నాకు శాస్త్రం లేదిహ'' అంటూనే చొక్కా విప్పి, జంధ్యం తీసి, చుట్టచుట్టి నియంత పాదాల వద్ద వుంచాడు. బొట్టూ లేదు. మొలతాడు పైకిలాగి తెంపేశాడు. వ్యాసమహర్షి.

''నువ్వు తలుచుకోగానే వస్తాను'' అని ప్రామిస్ చేసి తల్లిని వదిలి వెళ్లిపోయాడట'' అవసరానికి వచ్చి ఆదుకుంటూనే వుంటాను. ఆత్మీయులను త్యజించటం లేదు. నేడే నాకు పరిపూర్ణ స్వాతంత్ర్యం లభించింది. సంతోషం యెవరి ప్రైవేటు బతుకు వారి స్వంతం'' అని పాడుతూ చొక్కా యెక్కించుకుని వెళ్లిపోయాడు. రెండవ జనరల్ కుమారస్వామి.

మూర్ఛించిన నియంతకి కుమారస్వామి మాటలు అర్థముగాలేదు. బుర్రలో దూరనూ లేదు. ఆస్తి తనపేర వున్నది. తాను ఐచ్ఛికంగా యివ్వనిదీ కుమారునికి చెందదు. ఆస్తి వదులుకుంటాడా?!'' అనుకున్నది.

4

పద్దెనిమిదివందల యాభైయేడులో తలెత్తిన తిరుగుబాటును తెల్లపాలకులు సిపాయి మ్యూటినీ అన్నారు. ఆస్తులూ చిన్న చిన్న రాజ్యాలు అక్రమించే అన్యాయాన్ని భారతీయులు యెదుర్కుంటుంటే, దేశద్రోహ నేరం మోపి అణచసాగారు. తాంతీయతోపే'' నా మాతృదేశానికి నేను ద్రోహినీనూ, పై నించి వచ్చినవాడవు నీవు పాలకుడవూనా?'' అని యెదిరించాడు. పోరాటంలో కుడిచేతి మణికట్టు వద్ద గాయమై రక్తం పోతున్నది. విషాక్తం అవుతుందని, యెడమ చేతిలో కత్తి పట్టుకుని కుడిచేయి నరికి గంగామాతకర్పించాడు.

ఝాన్సీ లక్ష్మీబాయి భర్తా పోయాడు. పుట్టిన కొడుకూ పోయాడు. యాచించారని తెల్ల దొరతనానికి ఆహారపదార్థాలూ ధన సహాయమూ చేస్తూనే వచ్చిందా రాణి. వారి తత్త్వం యెలా యెప్పుడు తెలిసి వచ్చిందంటే, ''నీకు దత్తాధికారం లేదు. స్టేట్ మాది'' అని దాడి చేస్తే, దత్తత చేసుకుని దత్తపుత్రుని వీపుకి కట్టుకుని, గుఱ్ఱమెక్కి కత్తిపట్టుకు పోరాడింది ఝాన్సీ రాణి, లక్ష్మీబాయి. సాయమూ అందింది. గెలిచింది. కాని సాయపడినవాడు సంతోషంతో సంతర్పణ చేస్తుంటే, ''తెల్లవారు దొంగదెబ్బ తీస్తారు. యేమారి వుండరాదు. ఇపుడు సంతర్పణ గాదు చేయాల్సింది. యుద్ధపరికరాలు సేకరించాలి. వారికి ఫిరంగులున్నాయి'' అని హెచ్చరిస్తే వాడు వినిపించుకోలేదు. ఫిరంగి గుళ్లు, కోట చుట్టూ కట్టిన మట్టి గోడల్లో కూరుకుపోయాయి. కాని మళ్లా పోరాటం మొదలు ''భరణమిస్తాము లొంగిపో'' అని దౌత్యం నెరపారు తెల్లదొరతనం. యుద్ధం చేస్తూనే, ఒక సిపాయి దొంగదెబ్బ తీస్తే తూటా తాకి గుఱ్ఱం మీదే ఒరిగిపోయింది రాణి. ఒక పూరింట్లో చేర్చారు అంగరక్షకులు. ఇల్లు ముట్టించారు. అవే అంత్యక్రియలు. చిన్న కథ వున్నది. అలెగ్జాండర్ ఒక గ్రామానికి వస్తే గ్రామ పెద్ద మంచం వేసి కూచోమని, యెదురుగా యెత్తుపీట వుంచి, పళ్లెంలో ఆహారంతో పాటు ఒక బంగారు బిస్కట్టు గూడా పెట్టాడుట.

''మీరు బంగారం తింటారా?'' అనడిగాడు అలెగ్జాండరు.

''తినం. నీ కదిలేకే వున్న చోటికి వచ్చి దాడి చేశావు'' అన్నాడు గ్రామపెద్ద. సరిగ్గా అప్పుడే తీర్పుకోసం యిద్దరు కర్షకులొచ్చారు. ''మేమిటి తగాదా?'' అనడిగాడు గ్రామాధికారి.

''వీడు నాకు కొంత భూమి అమ్మాడు దొరా. నేల తవ్వి సేద్యం చేతామని తవ్వుతుంటే బంగారుకాసులున్న బిందె దొరికింది. మీ వాళ్లు దాచుకున్నారేమో నీదే ఆ కాసులబిందె తీసుకో'' అన్నాను. వీడు తిరస్కరించటమే గాక ''భూమి అమ్మేశాక అది నీదే. దానికింద యేమున్నా అది నీదే తీసుకోను'' అన్నాడు. సద్ది చెప్పబోతే అమ్మినవాడు ససేమిరా అన్నాడు.

''అయితే ఓ పని చేద్దాం. నీకు కూతురున్నదా?''

'' ఉన్నది దొరా?'' అన్నాడు కొన్నవాడు.

''నీకు కొడుకున్నాడా?'' '' ఉన్నాడు '' అని మొదటి వాడన్నాడు. ''వారికి పెళ్లీడొచ్చిందా?'' ''వచ్చింది''. ''అలాయితే వారికిద్దరికీ పెళ్లిచేసి ఆ కాసుల బిందె వారిద్దరికీ కానుకగా యివ్వండి'' అన్నాడు గ్రామపెద్ద.

''అలాగే చేస్తాం దొరా'' అని దణ్ణం పెట్టి వెళ్లారు. ఇదంతా అలెగ్జాండరు చూస్తూ వింటూనే వున్నాడు. కాసుల బిందెను చూశాడు.

''మేము అలాటి తీర్పు యివ్వం''అన్నాడు అలెగ్జాండర్.

''మీరైతే యేమి చేస్తారు ఆకాసుల బిందెను?''

''భూమీ, భూమికింద యేమున్నా అంతా ప్రభుత్వానికే అని ఆ బిందె కాసులూ తీసుకుంటాము''. వింతపడి గ్రామాధికారి అడిగాడు ''మీ దేశంలో వానలు పడతాయా?'' ''పడతాయి. యేం?'' ''అలా అయితే పశువులుండాలే'' ''వున్నాయి'' ''చూశారూ ఆ వానలు ఆ పశుగ్రాసం లేవాలని పశువులకోసం పడుతున్నాయి. మీ కోసం గాదు'' అన్నాడు గ్రామాధికారి.

సనాతనాచారాలు పాటిస్తూ, ఒడుగులు తిరుపతిలో దైవ సన్నిధానంలో చేయిస్తూ, జపతపాదులు, మడివెళ్లలలూ నేర్పుతూ, శిష్టాచారం,

ఆర్షసాంప్రదాయం నిలబెడుతున్నాననుకున్న దుర్గాంబకి, బాంబు పడినట్లు, వడగళ్ల వాన కురిసినట్టు, మొదటి తిరుగుబాటులాగా భయంకర నీలివార్తలూ, ఆకాశరామన్న వుత్తరాలూ వచ్చాయి.

''మీ రెండో జనరల్ మీకు దూరమౌతున్నాడు. చదువనే మిషతో ఒకమ్మాయిని మచ్చిక చేస్తున్నాడు. దానికి వశమతున్నాడు. ఇది గాంధర్వం గావచ్చు. మొగ్గలోనే తుంచేసుకుని, కొడుకును కాపాడుకోండి. ఆకాశరామన్న''.

తిరుగుబాటునణచాలని దుర్గాంబ తానే స్వయంగా వెళ్లింది. కొడుకు దొంగనవ్వు నవ్వుతూ, మర్యాదలు చెల్లించి ప్రయాణం కట్టించాడింటికి. ''పోతాలే గానీ'' అని తానూ దొంగ నవ్వు విశాలంగా నవ్వి, ''దాన్ని రావద్దని చెప్పావా?'' అన్నది.

''దేన్ని? మనం ఒప్పందం చేసుకున్నాం. నా ప్రైవేట్ బతుకు నా స్వంతం. నాకు శాస్త్రం లేదు'' అన్నాడు.

వాకిట్లో కొత్త జట్కా. జట్కావాలా ''బాబూ రైలు వేళైంది రావాల. రావాల'' అని కేక వేశాడు.

''అంతగా నన్ను దిక్కరించదలిస్తే, విధవ నెన్నుకోరా స్వామీ. నాలుగో వర్ణందాన్ని తెచ్చుకోరా స్వామీ. దానికిగానీ, వాళ్లమ్మకి గానీ మంచి పేరూ లేదు. వారి జాతకాలూ బాగలేవు. తల్లి కాలుపెట్టిన చోటల్లా నాశనం. ఇది పాదం పెట్టిన నాటినించే నీ రాబడి పడిపోయింది. వారంతా తండాలుగా వస్తూ పోతూ వుంటారు. మందు పుచ్చుకోటానికి వూరొచ్చి యిల్లు దొరక్క నీవద్ద వుండి వెళ్లిన శాంతి పిన్ని, దాని అత్తగారూ నాకంతా చెప్పారు'' అని అడివిలో కార్చిచ్చు అంటుకుంటే చంద్రమతీ దేవి ఆంజనేయ దండకం చదివినట్టు, దండకం అందుకున్న తల్లిని చూస్తూ ''బండి పంపేయనా? ఇంకనువ్వే నడిచి స్టేషన్కి వెళ్లి రైలెక్కాలి. ఇదుగో టికెట్. జట్కావాలా కొనితెచ్చేశాడు. తీసుకో. నాకు ఆఫీసుకి వేళైంది. అదుగో నా కోసం జీప్ వచ్చేసింది నీ యిష్టం'' అని ఫుల్

సూటులో వున్న స్వామి అన్నాడు.

''పోతున్నాలే'' అని సంచీ అందుకుని, వీధి గుమ్మం దాటి జట్కాలో యెక్కుతూ, '' నా అనుమతి లేనిదీ, నా యిష్టం లేనిదీ, నేను రమ్మననిదీ యెలా నా యింట్లో అడుగుపెడుతుందీ? నువ్వెలా తెస్తావు దాన్నీ?'' అని గొణుగుతూ బండిలో దూరింది.

జట్కా దౌడు తీసింది. హీరో జీప్‌లో దూరాడు.

5

దుర్గాంబను వుడికించదలచుకున్నవారు, యేదో మిషపెట్టి వచ్చి, పనిలో మునిగి వున్న దుర్గాంబతో''నీ రెండోకోడలు నీళ్లోసుకున్నదిట వదినా. నీకు మనుమలున్నారుగా. మనుమరాల్నెత్తుకోబోతున్నావిహ. లడ్డూలు అరిశలు పంచు వదినా. మంచి నేతితో చాలా రుచిగా చేస్తావా రెండూ. లడ్డూలు పంచదార రాల్తూ, బూందీ కరకరలాడుతుంటాయి. అరిశలమీద నేయి పేరుకుని తుంచి నోట్లో వేసుకుంటే కరిగిపోతుంది. నువ్వుపప్పు, చాయ పప్పు అద్ది చేస్తావా మరీ రుచి అరిశలు. మాకలా చేయటం రాదు. అరిశపాకమే రాదు'' అలా యికిలిస్తూ తైరుపోస్తూ, కరివేపాకో, కొబ్బరి చిప్పో అల్లం ముక్కో అడుగుతారు. దొడ్లో పచ్చిమిరప కోసుకుంటామంటారు.

ముందు నివ్వెరపోయినా దుర్గాంబ మంద్రస్వరంలో దీర్ఘం తీస్తూ జవాబిచ్చింది. పనీ ఆపలేదు.

''యే ప్రకారం కోడలౌతుందీ? నువ్వన్నా, నేనొప్పుకున్నా వస్తే నలుగురూ నవ్వరా? మా వాడికెన్ని గుండెలూ తేవటానికీ? నువ్వు సరసానికన్నా మరదలా, నేను పంచాలనుకున్నా యీ లెక్కన చాలామంది పైకి తేలచ్చు. అంతమందికి చేయగలనూ వేడుకలూ. ''తానూ నవ్వించగలిగానని సంబర పడింది. ''పో. పో. వంట అయిందా పచ్చిమిరపా, కరివేపాకూ కోసుకెళ్లు'' అని తోలేసింది. కాని గుబులు బయలుదేరింది గుండెల్లో.

కోర్టులో సాక్ష్యమివ్వటానికి స్వామిరానే వచ్చాడు. సంతోషంగానే వున్నాడు. మనమడు గట్టెక్కటం లేదనీ, పరీక్ష చెట్టెక్కుతున్నదనే ఘోషవిన్నాడు. చెల్లెలు తన కూతురుకి సంబంధం చూడమన్నది మెట్రిక్ చాలుట. తోలేయాలిట. తన అస్వస్థత చెప్పింది. ఫిజిషన్ డాక్టరమ్మ దగ్గరకి తీసికెళ్లి కంప్లీట్ చెకప్ చేయించి ప్రిస్క్రిప్షన్ అందుకుని మందులు కొని యిచ్చాడు. వాడుకోటం చెప్పాడు. టానిక్కులూ, ఇల్లు సందడిగా వున్నది. బంధుమిత్రాదులు, సంబంధ బాంధవ్యాలూ దొర్లాయి. దుర్గాంబ నిగ్గదీసింది.

''నిన్ను గురించి యిలాంటివి వింటున్నావేంరా స్వామీ? నిప్పులేని పొగ రాజుతుందా? తండ్రివి కాబోతున్నావని మాట మాత్రం నా చెవిన వేస్తే యేం పోయిందీ? విడిపోదలచావా? కన్నవారికి దూరంగాదలచావా?'' తడి చీరా. నడ్డిన చేయీ. రైక యెండిందే. ఆరీ ఆరని జుట్టు ముడేసుకున్నది.

టీనేజర్ మనమడు ఇహిహీ అని నవ్వుతూ గెంతుతూ, ''చిన్నాన భీష్మ ప్రతిజ్ఞ చేశాడుగా మమ్మీ. నువ్వెలాగూ ఒప్పుకోవు. పడనివ్వవని అందరికీ తెలుసైపాయె. చిన్నాన మగాడు గదూ. ఆఫీసరూ. సంపాయించుకుంటున్నాడు. నిన్ను దేవిరించక్కర్లా'' అని పారిపోయాడు.

'' ఇంటికి రాగానే నసపెడతావేమిటమ్మా? పోనీ నిజమేనందామన్నా యేదో యేడిచాడనుకోలేవూ? నీకు నగుబాటయే పనెందుకు చేస్తాడు తమ్ముడూ? చెందకుండా పోవటమేమిటీ? అదేం మాట. ఇంటి రిపేర్లు, యింటి పన్నూ చూస్తున్నది తమ్ముడే. నీళ్లు తోడలేరని బోరింగ్ పంపు వేయించి సౌకర్యం కలిగించాడా? ఖాళీస్థలం వేస్టు కాకుండా, ద్రాక్షతీగపందిరి, అమృతపాణి అరటి పిలకలు నాటించాడా? తొందరపడి దులిపేయటమే'' అన్నాడన్న నవ్వుతూ. ''పిల్లలు చదువుకోవాలి. పైనగది వేయిద్దాం అన్నాయ్. వాళ్లకి ప్రైవేసీ యేదీ? వచ్చేపోయే వారితో వాళ్లు చెప్పే కబుర్లు వింటంతో సరిపోతున్నది. ట్యూషన్ మాటాడి వచ్చాను. రూమ్ వారానికల్లా తయారౌతుంది పైన. లైటూ వస్తుంది'' అన్నాడు స్వామి. దుర్గాంబకు నిజం తెలుసుకోవాలని దుగ్ధగానే వున్నది.

6

ఓటమి ఒప్పుకోటం యిష్టంలేని దుర్గాంబకు మరో యెదురు దెబ్బ తాకింది. స్నేహాలు ముదిరి, ప్రోత్సాహం లభించి, వుద్యోగం మానేసి, పార్టీ సభ్యుడై, పార్టీ ఫౌండర్ ప్రోద్బలంతో, సంఘోద్ధరణ, సమాజ సేవ, అనాథ వుద్ధరణా చేశాడు మూడవ జనరల్ సారథి. జనరల్ సెక్రెటరీ అయినాడు. మంత్రి అవుతాడని చెప్పుకుంటున్నాడు. పార్టీ సభ్యురాల్ని పార్టీ ఆశయాల ప్రకారం పార్టీ పద్ధతి మీద పెళ్లాడేశాడు.

సారథికి పిల్లనిస్తామన్నవారే వివరాలతో సహా చెప్పేశారు. దుర్గాంబా, భర్త శివయ్యా మూర్ఛపోయినారు. శీతలోపచారాలు చేసి లేవదీశారు. వార్తలు చదివినవారు. దిగాలబడి చూసింది దుర్గాంబ. విడో, వేరే శాఖ. ప్రథమ శాఖా ప్రాణ ఘాతా పార్టీ కొత్తగా పైకి తేలింది. పార్టీయే శరణ్యం. వెలవెలబోతున్న తల్లిని చూసి మూడవ జనరల్ సారథి ''అన్ని బాధ్యతలూ పార్టీవే. నువేం చేయక్కర్లా. అనవసరంగా భయపడుతున్నావు. నీ ఆచార వ్యవహారాల కడ్డుండదు'' అని దిలాసా యిచ్చాడు. తల్లి మేనల్లునికి కో ఆపరేటివ్ సొసైటీలో క్లర్క్ జాబ్ యిప్పించాడు. తండ్రి మేనగోడలికి చౌకగా సంబంధం నిశ్చయించి లగ్గం బెట్టించాడు. యేమివ్వాలా పెళ్లివారికి. విందు, అంపకం. అంతే.

7

శక్తి సన్నగిల్లుతూ, జవసత్వాలుడుగుతూ, పళ్ల బిగువున రోజులు దొర్లిస్తూ దర్పంగా వుండగలుగుతున్న దుర్గాంబకి, పిడుగుపాటులాగా, కోడలు నీలవేణి మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చి, జీవిత సంగ్రామంలో పోరాడి పోరాడి మూడవరోజున రణరంగం మీదే నేల కొరిగింది.

తేనెతుట్టె రేపినట్టయింది. అటువంటి సంఘటన యెవరూహించలేదు. పీడకలన్నా రాలేదెవరికీ.

ఒక్కొక్క కాలనీయే కోల్పోతున్న నియంత జీవితంలాగా వున్నది దుర్గాంబ జీవితం. ఇంటి పెద్ద శివయ్యగారికి ఆర్థ్రైటిస్ వచ్చింది. అవి మేహ

నెప్పులనుకున్నాడు. కరెంట్ ట్రీట్‌మెంటుతో మేహ నొప్పులు నయమౌతయ్యని విన్నాడు. యెవర్నీ సంప్రతించకుండా ఆ ట్రీట్‌మెంట్‌కి వెళ్లాడు. కొండ నాలుక్కి మందువేస్తే వున్న నాలుక వూడిందట. మోటు సామెత. అలాగా రెండు కాళ్లూ పనికిరానివయ్యాయి. చాలా మానసిక వేదనకు గురి అయ్యాడు శివయ్యగారు. సేవ చేయటం తప్పితే సేవలందుకోటం యిష్టమూ లేదు, అలవాటూ లేదు. కర్షకులతో కలిసి పంటకోయటం, నాట్లు, కలుపు యేరటం వంటివి చాలా యిష్టం శివయ్యకు. చితీ చింతా అన్నారు. చితి శరీరాన్ని కాలిస్తే చింత మనస్సును కాలుస్తుంది. గౌరతపోయిందే అని, యిద్దరు జనరల్స్ వంశానికి అప్రతిష్ట తెచ్చారని, తాను సంపాదన పరుడు కాకపోగా, ఐపి దాఖల్ చేశానే అని ఆస్తి భార్యపేరపెట్టి లోకువైనానే అనే చింతతో కృశించి, మంచాన బడ్డానే అని కుంగి కుంగి దేహయాత్రకి ఫుల్‌స్టాప్ పెట్టి పరమపదం చేరాడు. మొదటి జనరల్, అంత్యక్రియలు శాస్త్రీయంగా చేసి, అస్థినిమజ్జనం చేయాలని ప్రయాగ వెళ్లి, అక్కడా శాస్త్రీయంగా అన్నీ ముగించి వచ్చాడు. దుర్గాంబ కేశఖండనం చేయించుకుని, తెల్లబట్టకట్టి, అన్నీ తీసేసి, ముసుగుకి గౌరవమిచ్చింది.

కేశఖండనమనే ఆచారమెలా వచ్చిందో తెలుసుకుంటే బాగుంటుంది. పిప్పలాదుడనే ఋషి వేదాలు వల్లిస్తుంటే, గర్భిణీ భార్య వినేది. లోపలి బిడ్డ'' తప్పు చదువుతున్నావు'' అన్నాడుట. భూమిమీద పడకముందే తండ్రిని తప్పు పడుతున్నావే అని'' అష్టావక్రుడవై భూమి మీద పడు'' అని శపించాడు తండ్రి. పిప్పలాదుడేమో ధధీచి ఋషి కొడుకు. దేవతలు రాక్షసులను గెలవటమెలా అని బృహస్పతి నడిగితే ''ధధీచి అనే ముని వెన్నెముక తెచ్చి పలుకులు చేసి అవి ఆయుధాలకి అతికించి పోరాడితే గెలుస్తారు'' అని చెప్పాడు. ఇంద్రుడు అనుయాయులతో వెళ్లి తమ యిబ్బందీ, గురువు సలహా చెప్పుకున్నాడు దధీచితో ''అలాగే యిస్తా యిది దేవకార్యం'' అని ప్రాణాలు వదిలాడు. యెముకలన్నీ తీసుకోమన్నాడు. దేవతలు గెలిచారు. కాని ధధీచి భార్యకి నెలలు. వాళ్లవాళ్లామెను పిప్పలి వృక్షం నీడన వుంచారు. అందుకని పుట్టిన పిల్లాడికి పిప్పలాదుడు అని

పేరుపెట్టారు. గొప్పవాడైనాడు పెళ్లాడాడు. వాదానికి రమ్మని ఛాలెంజ్ చేస్తే వెళ్లి ఓడిపోయాడు. ప్రత్యర్థి ఆయన్ని నూనెలో వుంచాడు. యెనిమిది వంకర్లతో అష్టావక్రుడు పుట్టి పెరుగుతూ తండ్రి యేడని అడిగాడు. తల్లి చెప్పింది. అష్టావక్రుడికి వడుగైంది. అధ్యయనమూ అయింది. తానే వెళ్లి వాదానికి రమ్మని ఛాలెంజ్ చేశాడు. తండ్రిని ఓడించినాయన ఓడిపోయాడు. తండ్రిని విడుదల చేసి పంపేశాడు. అష్టావక్రుడూ పెళ్లాడాడు. సంతానమూ కలిగింది. కాని భార్య చిన్నచూపు చూస్తూ యీసడించేది. ''నీకు సంతతూ కలిగింది. సాటి ఋషిపత్నులూ నిన్ను గౌరవిస్తున్నారు. అన్నవస్త్రాలకు లోపం లేదు. నిలువ యిల్లున్నది. ఇన్ని యిచ్చినా యిస్తున్నా నీకు భర్త విలువ తెలిసిరావటం లేదు. నేటినుంచి స్త్రీలకి భర్తపోగానే కేశఖండనం చేసి అన్నీ తీసేసి విరూపిని చేయాలని ఆచారం అమలులోకి వస్తుంది. అప్పుడు గాని భర్తవిలువ తెలిసిరాదు స్త్రీలకి'' అన్నాడు. పవర్‌ఫుల్ అష్టావక్రునిది వేదవాక్కయింది. అంతకుముందు స్త్రీలకి భర్తపోతే మెడలోని గుర్తు తీసేసేవారంతే. ఒక చెట్టు విలువైనది, ఔషధానికి పనికి వచ్చేది. దాని కొమ్మ తెచ్చి చెక్కి చిన్న కర్రగా యిచ్చేవారు. అది చేతిలో వుంటే భర్తలేడని గుర్తు. కాలం పరుగెత్తి కేశఖండనం మిగిలింది.

మాసికాలూ, త్రైమాసికం పెడ్తుండగా, యేడూరిపెట్టి పితృకార్యం పూర్తిచేయకుండానే, నలతగా వుంటూవచ్చిన ఫస్ట్‌జనరల్ మంచమెక్కాడు. డాక్టర్లు యిదమిద్ధమని తేల్చలేక పోయారు. కుమారస్వామికి ఖబర్ అందగానే వచ్చి చూసి విన్నాడు. పట్నం తీసికెళ్లి అపోలో హాస్పటల్లో అడ్మిట్ చేశాడన్నని. అతని డాక్టర్ మిత్రుడు స్పెషలిస్టు, ఫిజిషన్. పరీక్షలైనై.

''అదీ కొత్తగా వ్యాప్తిలోకి వస్తున్న టి.బి. అల్సర్ కాదు. కండరాల్లో, బొమికల్లో వస్తున్నదీ కొత్త వ్యాధి. దగ్గు వుండదు. టెంపరేచర్ నోట్ డౌన్ చేసి, యూరిన్ టెస్ట్ చేయించగానే తెలిసిపోతుంది'' అని ధైర్యం చెప్పి సరైన ట్రీట్‌మెంటూ మందులూ ప్రారంభించాడు. నెల గూడాపట్టలేదు లేచి నుంచున్నాడు అన్న. టెంపరేచర్ నార్మల్. యేడూరికింకా వ్యవధి వుందనగా

స్వామి ఫస్ట్ జనరల్‌ని యింటికి తెచ్చి నియంతకప్పగించాడు. నియంత సంతోషించిందిగానీ'' పిల్లకు పెళ్లి చెయ్యవుట్రా, పెళ్లీడొచ్చేసింది'' అని డ్యూటీ గుర్తుచేసి అర్ష సంప్రదాయం నిలబెట్టాలన్నది. ''జబ్బు తెచ్చుకుని పట్నంపోతే యిక్కడ బాధ్యులెవరు?'' అన్నది. ''జామాతా దశమ గ్రహం'' అని వుక్తి. కవి చిలకమర్తి, ఆంధ్రామిల్టన్ అని పేరుగాంచినవాడు, నవ్వులగని అని బిరుదు పట్టా పొందిన పంతులుగారు, '' ఈ దశమ గ్రహం మొదట మిథునరాశిలో ప్రవేశించి తర్వాత కుంభరాశిలోకి నడుస్తుంది'' అని చమత్కరించారు.

ఫస్ట్ జనరల్ కన్నార్పకుండా చూసి, ''అంటే కన్న గ్రహాలు కాక పైనించి మరో గ్రహం నా సంపాదన మేయటానికి రావాలన్నమాట'' అని మెల్లిగా అంటుంటే విన్న స్వామి నవ్వుమొహం పెట్టాడు.

బ్రిటన్ పియం చర్చిల్‌ని పట్రమ్మన్న నియంతలాగా కనిపించింది తల్లి దుర్గాంబ. భార్య విమానం యెక్కి వెళ్లటమే పెద్ద షాక్. ఇంట్లో జనాభా కందిరీగలల్లే తిరుగుతూ తిట్టుతూ వచ్చిపోయేవారినీ కుట్టుతుంటే, అతిథీ అభ్యాగతుల సంఖ్య తగ్గిందని సరిపెట్టుకున్నాడు ఫస్ట్ జనరల్.

కందిరీగల టార్జెట్ నియంత. కాలనీస్ పోతున్నా మనమడి పెళ్లి చూసింది. మనమరాలు సుకుమారి. ఇంతమందికి వండి వడ్డించగలదూ? వంటమనిషినేమో ఎంగేజ్ చేశాడు ఫస్ట్‌జనరల్. వంటా వడ్డనా యెలావున్నా సరసాలు విరసాలు జోరుగా సాగాయి. రెండుపూటలా ఆహారం ఆకుపొట్లాలు కట్టి వంకెబుట్టలో పెట్టి తీసికెళ్తుంది. తన మనమల్ని యేవిరా అని సంబోధించటం భరించలేక పోయింది నియంత.

8

చిలికి చిలికి గాలివానలాగా రగడ నానాటికీ పెద్దదైంది. ఒక రాజు ఇన్నోసెంట్ ది థర్డ్ అనే మత గురువును చంపించాడట. తరువాతి దారుణాలు చూసి ప్రజలు, ''మతగురువు చచ్చి పగతీర్చుకుంటున్నాడు'' అన్నారుట. మళ్లా పియం కావాలని మధ్యంతర యెన్నికలు తెచ్చి, ఎలెక్షన్ ప్రచారానికి వెళ్లిన ఎక్స్

పియం తమిళ పులుల పన్నాగంలో హతుడైనాడు. తర్వాత రేగిన పరిస్థితులు, పులుల నాయకుని మీద దాడీ, పత్రికలలో చదివి ప్రజలు హతుడు, హత్య చేయడానికే తన ప్రతిభ చూపుతున్నాడన్నారు. పులుల అంతు చూస్తున్నాడు.

తిరుగుబాట్లు, యెదిరించి మాట్లాడటం, పాత విషయాలు తవ్వి దెప్పటం, చూస్తూ వింటున్న యిరుగుపొరుగు గుసగుసలు పోయారు. ''నీలవేణి చచ్చి సాధిస్తున్నది. అత్తభరతం పట్టిస్తూ, మొగుడి తాళం పడుతున్నది. మీరు గెజెటెడాఫీసరు భార్య అనీ, యింటికి యిల్లాలు అనీ గమనించారా నీలవేణిని? నోరెత్తనీయలేదు. కుక్కపిల్లే నీలవేణి. లేదా గొర్రెపిల్ల. నోరుగల వారిది రాజ్యం. జనరల్ వంటి పుత్రులు తన పక్షమేనని విర్రవీగింది నియంత. ఔదార్యంగల దాన్నని నమ్మించాలని కబుర్లాడేది. నమ్ముతారా?'' అని వూసులాడుతున్నామెను శ్రోత అడిగింది. ''యెలా వెల్లడించింది? యెలా ఒలకబోసింది? దాక నోరూ, రథమంత శరీరం''. ''హుయ్యో రాతా! విశాలంగా నవ్వుతూ తానే చెప్పింది. ఒకరి పచ్చ చూడటం, వారి పేరు ప్రఖ్యాతులువినటం కష్టమేననుకో నీలవేణిని మైనారిటీ అందాము. అత్తది మెజారిటీ అనచ్చు''.

అల్బేనియాలో ముస్లిముల సంఖ్యా బలం పెరిగి వారు ఉన్నతి పొందుతుంటే భరించలేక క్రిస్టియనులు వారిని తన్ని గెంటేయసాగారు. ఒక ఫాదరీ సరసమాడాడు. ''ప్రవక్తయేమన్నాడంటే ' ఒకదేశంలో తలదాచుకోటానికొచ్చి, ఆ దేశీయులను పీడించి అవమానించమన్నాడు''.

దానికో చరిత్రకారుడైన ముస్లిమ్ జవాబిచ్చాడు '' ఒకనాడీ భూమి ఒట్టామన్ ఎంపైర్లోదే, మీదా? మేరీ మాత సృష్టించి భూమిమీద వదులుతూ 'సైలెన్సును అణిచి, దయా ప్రేమా పెంచిరా'' అని చెప్తే ఆ బిడ్డ అలాగే చేస్తూ యీ చెంప కొడితే ఆ చెంప చూపు'' అని బోధిస్తూ ముళ్ళకిరీటం పెట్టించుకుని, దయ అంటే యిదీ అని డెమాన్‌స్ట్రేట్ చేశాడు. 'ఫాదర్ వారేమి చేయుచున్నారో వారికి తెలియదు' అంటూ శిలువనెక్కి మానవుల శాంతికై రక్తం ధారపోశాడు. ఉక్రోషంతో సాటిమానవులను తన్ని తోలేయమనలేదే''.

అత్త ఔదార్యం చెప్పక యేదో వాగుతావేం?'' అని విసుక్కున్నది శ్రోత. అభినయిస్తూ చెప్పింది వక్త, '' ఆ కాఫీ బొచ్చెలు కడగలేకపోతున్నావు. ఆయాసపడుతున్నావు. మడి చాల్లే. యానాది సుబ్బికి వేయి ఆ బొచ్చెలు కడిగి బోర్లించమను. నీళ్లు పోసి తిప్పి కడిగి, వాడుకో. అలివెడు బొచ్చెలు, వచ్చేవారికి కాఫీ నీళ్లు పోయటమే గాక యింట్లో వాళ్లూ రెండుసార్లు సేవిస్తారైపాయె. మేము కాఫీ ఎరగం. కప్పుడు నారింజరసం తాగేవాళ్లం. వడ్లపూడి నారింజ పులుపే వుండదు. పంచదార అక్కర్లా. పప్పుండల్లోను బెల్లమూ కమ్మని నేయీ అంతే'' అని చెప్తూ శ్రోతలున్నారని హుషారొచ్చి, నవ్వుతూ చెప్పుకెళ్లింది. ''మనమడికేదో చిన్న సుస్తీట''. ఈ సుస్తీకి డాక్టరు కావాలా అని మా మేనమామ ఘనవైద్యుడు, గుర్రబ్బండీలోవేసి తీసికెళ్లాడా మనమడిని. మా మేనమామ నా మనమడి బాధ చేత్తో తీసేసినట్టు తగ్గించేశాడు. ఈ భాగ్యానికి ఫీజెందుకూ అని పల్ల గోంగూర పచ్చడి కొత్తది చిన్న జాడీడు యిచ్చా మామయ్యకి. '' ఇవన్నీ యెందుకే దుర్గా, నా సత్తా గుర్తుంచుకుని, నమ్మకం తో వచ్చావు అదే చాలు'' అన్నాడు.

ఆ అభినయం, అనుకరణ చూసి శ్రోతలు సంతోషిస్తూ ''నువ్వ మరీనూ దుర్గా!'' అని చేత్తో నెట్టుతూ హర్షం వెలిబుచ్చారు.

## 9

ఆంప్లి ఫయ్యరు విడుదల చేస్తున్నట్టు ఆయింటినించి, గాలివాటానికి, రగడ వినిపిస్తుంటే, తమ పనులు తాము చేసుకుంటూ మధ్య మధ్య పిట్టగోడమీది నించి చూచి వినోదిస్తూ ఒకళ్లతో ఒకళ్లు కళ్లతో మాట్లాడుకుంటున్న యిరుగు పొరుగూ. హయ్యో! అనో సారీ, హవ్వ! అని మరోసారి దవడలు నొక్కుకుంటూ అష్టావధానం చేస్తున్నారు. దూరశ్రవణం నుంచి సంగీతం, గుడి గంటలు, ధూప పరిమళం, మంత్రపుష్పం వినవస్తున్నాయి. అసలు ఆ రోజు రగడ యెలా యెందుకు మొదలైందీ తెలియదు.

గడిచిపోయిన రోజుల్లో గ్రామంలో దేవునికి పెళ్లి చేసి వేడుకలూ విందూ చేసి, పాటలూ, పద్యాలు పాడి, రథంలో వుత్సవ విగ్రహాల నలంకరించి వుంచి,

రథమూ పూలదండలతో అలంకరించి వూరేగింపు చేసేవారు. దాని పేరు రథోత్సవం. రథం తాళ్లు భక్తులే లాగుతారు. చక్రాలూ నెట్టుతారు. పొద్దూకి భయలుదేరితే గాస్‌లైట్ల వెలుగులో నాలుగు వీధులూ తిరిగి, కూడలిలో ఆపి భక్తుల కానుకలు తీసుకునేవారు రథం ముందు నాట్యగత్తెలు పాడుతూ ఆడేవారు. పండితులు వేదాలు వల్లించేవారు. సాముగరిడీలు నేర్చినవారు తమ నైపుణ్యం చూపుతారు. దేవుని లీలలు పాడుతారు. రగడలు చదువుతారు అవీ బావుంటాయి. దద దద దశ్వరభ! శరభ శరభో దశ్శరభ శరభా అని మొదలెట్టి దేవుని శౌర్య ద్విపదలో పాడతారు అది వాడుకభాషలో వుంటుంది.

ఆంధ్రకేసరి అనే బిరుదు పంతులుగారికెలా వచ్చిందంటే జాతీయ వుద్యమం వూపందుకుని దొరతనాన్ని గడగడలాడిస్తున్న రోజులవి. నేటి చెన్నై ఆనాడు మద్రాసు. ఆ రోజున హర్తాళ్. కొట్లు తెరవరాదు. కాంగ్రెస్ పార్టీ వాలంటీర్సు కొట్లు మూయిస్తున్నారు. ఒక బ్రాందీ షాపు తీసి, పనివాడు చిమ్ముతున్నాడు. వలంటీరు వచ్చి, ''ఇవాళ హర్తాళ్. కొట్టు తెరవరాదు. మూసేయ్'' అన్నాడు. పనివాడు వలంటీర్ను లెక్కచేయకపోగా చిమ్మిన కసవు కాగితం మీద కెత్తి వలంటీరు నెత్తిన పోశాడు. అలా మొదలై పెద్దదై వైను సీసాలు పగలగొట్టారు. వశం తప్పింది. ఆర్డర్లు వెళ్లాయి. అల్లరి ఆపాలని పోలీసులు తుపాకులు పేల్చారు. గుంపులలోని కొంతమంది నేలకొరుగుతున్నారు. చిన్నపిల్లలూ వున్నారు గుంపులో. వారూ నేలకొరుగుతున్నారు. ఒక వలంటీరు పరుగెత్తుకెళ్లి లీడరు టంగుటూరి ప్రకాశం పంతులుగారితో చెప్పాడు.

''చిన్నపిల్లల్ని గూడా తుపాకీ గుళ్ల కెరచేస్తున్నారండీ''

ప్రకాశం పంతులుగారు గొప్ప న్యాయవాది. రాబడీ పెద్దదే. సహాయనిరాకరణ వుద్యమ ఆశయాలననుసరించి న్యాయవాద వృత్తి వెలయాలి వృత్తి వంటిదని బాపూ అన్నారని, మానేశారు. చదువులూ మానేశారు పిల్లలు మిల్లు గుడ్డలు తగలబెడ్తున్నారు. ఖద్దరు కడుతున్నారు. పంతులుగారప్పటికేపేరు తెచ్చుకున్నారు వుద్యమంలో ఆయన బయలుదేరగానే అనుయాయులూ వెంట

వచ్చారు. ధీరగమనంతో వస్తున్న పంతులుగారిని పోలీసులు చూశారు. చొక్కా చింపి గుండె చూపుతూ మీదికి వచ్చేస్తున్న పంతులుగార్ని చూసి పోలీసులు, ఆయుధాలు కిందబడేసి పరుగెత్తారు. వాళ్లు భారతీయులే మరి. మన వేళ్లతో మన కళ్లు పొడుస్తున్నది దొరతనం. ఆయన్ని గుండెకెర చేస్తే కార్చిచ్చు మధ్య వున్నట్లే. జనసందోహాన్ని ఆపలేరు. కాల్పులాగిపోయాయి. కొట్లు మూశారు. ప్రజల ఆగ్రహజ్వాలలు తగ్గాయి.

ఇదంతా విని బాపూ, పంతులుగారిని ఆంధ్రకేసరి అన్నారు.

నాన్‌వైలెన్సు మూవ్‌మెంట్ లీడరు పంజాబ్ కేసరి.

లాలాలజ్‌పత్‌రాయ్ పోలీసుల లాఠీ దెబ్బలకు పోయాడు. అది విని వర్కర్సంతా లైటెనింగ్ స్ట్రైక్ చేశారు. తమ నాయకుని చంపినందుకు నిరసన వెల్లడించారు. అప్పటికి రష్యాలో లెనిన్ వున్నాడు. ఈ వార్త ఆయనదాకా వెళ్లింది. ''అదే రివల్యూషన్‌కి నాంది'' అన్నాడట.

శ్రీలంకలో పులులెలా వచ్చాయంటే, సింహలీస్‌కీ, తమిళులకి పడలేదు. కూలీలుగా వచ్చి, అన్ని రంగాలలో పైకి వచ్చారనీ, సంఖ్యాబలమూ పెరిగిందనీ పవర్‌ఫుల్ అవుతున్నారని తమిళులను చూస్తే మంట, అసూయ. భారత్ వెళ్లి పొమ్మన్నారు. మా కాయకష్టం మీదా, మా తెలివితేటల మీద శ్రీలంక అభివృద్ధి జెందింది. యెందుకెళ్లిపోవాలి అన్నారు తమిళులు. రకరకాల ఆంక్షలు వాళ్లమీది కొచ్చాయి. ఆనాడు ఒక వాహనం వెళ్తుంటే, '' ఇటుగా మీరు వెళ్ల గూడదు. మరో మార్గాన వెళ్లాలి. వెనక్కు తిరిగి పో'' అన్నాడు చెక్‌పోస్ట్ వద్దవున్న సింహలీస్ సిపాయి. డ్రైవరు తమిళ్. వాహనం పోనిచ్చాడు. అప్పుడే తగాదా మొదలు. గాలి వానైపులులు పుట్టి శ్రీలంకలో ఉత్తర ప్రాంతాన కొంత భూమి యిచ్చేయమన్నారు. ఇవ్వము అన్నారు సింహలీస్. దాంతో యిద్దరి మధ్యా యుద్ధం.

ఆఫ్రికాలో యిడీ అమీన్ నియంత అయి ఆఫ్రికన్ కాని వారిని హడలగొట్టి తరిమేశాడు. మా దేశ సంపద తరలించుకుపోతూ మమ్మల్ని హీనంగా చూస్తున్నారు అన్నాడమీన్ నియంత.

స్తంభాలల్లే యెదిగిన మనమల్నీ, తాను పెంచిన వారినీ చూసీ, వారి కటు వచనాలూ, నిందలూ నిష్ఠూరాలు విని నివ్వెరపోయింది నియంత దుర్గాంబ. మనస్సు మీద బొబ్బలెక్కినై. కందిరీగ కుట్టినట్టు ఫీల్ అయింది. నమ్మలేక, నించోలేక కుప్పున కూలింది. స్పృహ తప్పింది. తెలివి వచ్చి లేవబోతే లేవలేక పోయింది. నడుము వద్ద యడమవేపు పెరాలసిస్ వచ్చింది. కాలూ ముడవలేక పోయింది.

''నీ వాళ్లు వచ్చి మేయచ్చా? మా అమ్మవేపు వాళ్లు రాగానే ''వాళ్లని పొమ్మను. నేను వీరందరికీ వండి వడ్డించాలా? నీకు చేస్తున్నా చాలదూ? పట్టుమని పదిరోజులు తీసికెళ్లి సేవ చేశారా? పచ్చంపానం చూశారా నీకు? చూలింతవైనా బాలింతవైనా నేనే గతి'' అలా దెప్పుతూ కొడుక్కి గూడా పురెక్కించి తరిమేయించేదానివి. నాన్న మేనమామ అయనకు తండ్రితో సమానమైతే మా మేనమామకు తండ్రితో సమానమే. యేనుగంత తమ్ముడు వచ్చి, యేనుగ తిండి తిని, వెళ్లేప్పుడేదో సంగ్రహిస్తాడు. నీ తమ్ముడినేమీ అనలేం. కలవారి పిల్లల్ని తెచ్చి మేపటం, అదేం న్యాయం. మాకాస్తి పాస్తులేవీ? మా నాన్న సంపాదనే మాకాధారం. తాత అప్పు చేసి ఘనంగా కార్యకరామతులు చేయటమేమిటీ, ఉన్నదే సరిపెడితే దేవుడు మెచ్చడాయేం? అప్పు మీద వడ్డీ పెరిగి తడిసి మోపెడై, సమయానికి ధరలు పడిపోయి, దిక్కు మొక్కు దివాణం లేక ఐపి దాఖల్ చేసి, పొలమూ యిల్లూ నీ పేరబెట్టి అది స్త్రీ ధనమని తప్పించుకున్నాడు తాత. చేసిన అప్పులు తీర్చే బాధ్యత జనరల్స్ మీద పడి, సంపాదన అందుకున్నప్పటినించీ అప్పులు తీర్చటమేనైపాయె. అ స్త్రీ ధనం, యిల్లూ నిన్ను హిట్లరైట్‌ని చేసినై. మాటకు తిరుగులేదు. ఓటమి ఒప్పుకోవు. దర్పం. డాబు. మా అమ్మకు నోరెత్తే అధికారమిచ్చారా అసలు? నోరు విప్పగానే తల్లీ కొడుకూ ఛెడామడా నాలుగుతిట్టి దద్దమ్మను చేశారు. నీ తండ్రి అరవై యెకరాల ఆసామీ అయితే యేమిటి ఒరిగింది మాకు? ఆయన మొదటి బిడ్డలైతే మాకేమి లాభించింది? మా తాతకు నీ ఆసామీ తండ్రి యేమీ యివ్వలేదు. హిట్లరైట్‌నిచ్చి పెళ్లి చేసి వదిలించుకున్నాడు. నీ బలగం

మా తాత యింటి మీద బడి తినసాగింది అదీ లాభం. ఆదుకోటానికి నీవేపెవరూ లేరు. బాబాయి కొచ్చిన మేచ్ తిప్పేసింది నువే. ఆయన మానాన ఆయనని వుండనిచ్చావా? ఆయన ప్రైవేట్ లైఫ్‌లోనూ తల దూర్చావు. తనిఖీకి వెళ్లావు. ఆయనకు ఫామిలీ యేర్పడరాదనీ, నీ గుప్పిట్లో వుండాలనీ ట్రై చేశావు. మొదటి మేచ్‌కే నీవు వైదొలగి వుంటే, ఆయనకి నేమ్ అండ ఫేమ్ వచ్చేవి. డబ్బూ వచ్చేది. రిసెర్చ్ అవకాశం చేయి జారి పోయిందే అని నిరుత్సాహపడ్డాడు. మిడిల్ క్లాస్ మనిషి అయినాడు. అమ్మ పెట్టా పెట్టదు అడుక్కు తినానివ్వదని సామెత. అవసరానికి వాడుకుంటూ, వాడికెవరూ వుండరాదని నీ ఐడియా. పరీక్షలు గట్టెక్కిస్తాడనీ, వుద్యోగాలిప్పిస్తాడనీ నీ వారి యెదట యెందుకు డప్పుకొట్టావూ? నీ బలగానికి అన్నీ వుచితంగా చేసిపెట్టాలా? నీ కూతురొకతె నీకు బాగా వురెక్కించి వెళ్తుంది. వదిన అనుకుంటుందా? లేదు గేలిచేసి యీసడించి తూస్కారంగా మాట్లాడుతుంది. నీ సనిన్నా గొప్పేమిటీ? వ్యాజ్యాల కోరు. కోర్టులో డబ్బు కట్టాలి అప్పు యివ్వమంటే మానాన్న యివ్వలేదని, దూషించి నిందలు వేశాడు. ఆస్తిపరుడని గాదూ! గ్రామ మునసబు దత్తపుత్రుడని పిల్లనిచ్చాడు తాత! పెళ్లి ఖర్చులు తీర్చింది కొడుకులు. మరో వింత తెలుసా? నువ్వు సెలెక్టు చేసిన నీకు నచ్చిన మేచ్ అమ్మాయి మగడు అండర్ గ్రౌండ్‌లో వున్నాడు. మెచ్చదగ్గ నేరాల్లోనే యిరుక్కున్నాడా ఘనుడు. దొంగనోట్లు సరఫరా, నకిలీ సర్టిఫికేట్లు యిప్పించి, డబ్బులాగి, వుద్యోగాలొస్తున్నాయని పరారీ కావటం. బ్రోతెల్‌కి  అమ్మాయిల్ని అందించటం. నువ్వు కోడలుగా తెచ్చుకోవాలని పథకం వేసుకొన్నావే ఆ అమ్మాయి మేనమామ మాటలకు దగాపడి, సినీనటిని కావాలని ఒంటెడు నగలతో వెళ్లింది. అయిపోలా హిట్లరైట్! నిన్ను బోల్తా కొట్టించాలని చూసిన వియ్యంకుడు రేపు రిటైరౌతాడనగా యెన్ని లంచాలు పట్టాడో కేసు వెల్లడై బోనులో నిలబడ్డాడు. పెన్షన్ కోసి నాలుగో వంతు వస్తుందని తీర్పు యిచ్చి విడుదల చేశారు ప్రభుత్వం. భార్యకు కాన్సర్. అదీ శిక్షేనేమో.

పసికూనతో వాకిట్లోకొచ్చిన పిన్నిని ''డబ్బు కోసం వచ్చావా యిచ్చిందప్పుడే అయిపోయిందీ? నీ వాళ్లను మేపాలైపాయె. యెంతిచ్చినా చాలదు'' అని చిన్నాన నొవ్వనాడిగేటవతలనించే తరిమేయటానిక్కారణం నువ్వు! నీకూ తాతకీ వెరిచాడు. వీధిన బడతారేమో. కొప్పు పట్టుకు లాగి గుద్దులేస్తారేమో, మొహాన పేడ నీళ్లు చల్లుతారేమోనని భయపడ్డాడు చిన్నాన్న. ఊరి చివరెక్కడో ఓంకారాశ్రమంలో పని సంపాయించి తలదాచుకుంటే, ''దాన్నీ వూరినించి తగలడమను. తలెత్తుకు తిరగాలా అక్కర్లేదా? నా తలనేల బడేస్తావా?'' అని తాత నీకు వెరిచే, ఆస్తి నీ పేర వున్నదిగదూ మరి, చిన్నాన్నను నొవ్వనాడాడు. అవినీతిట. అప్పుల పాలుగావటం నీతా? కొడుకుల నెత్తిన రుద్దటం నీతా? నీ ఐవేజు నువ్వు వాడుకుంటూ మానాన్న చేత ఖర్చు చేయించటం నీతా? నువ్వు పలకటం నేర్పితే వాళ్లు చిలకలల్లే పలికారు. బండ్లు ఓడలూ, ఓడలూ బండ్లూ అయాయి దర్పంగా నువ్వు ''దాన్ని తెచ్చుకో నువ్వు నీ కుటుంబం దొడ్లో ఔట్ హౌస్‌లో వుండండి. అది యిల్లు కనిబెట్టి చూస్తూ పిల్లల్ని కమ్మెచ్చులల్లే తీరుస్తుంది'' అని చిన్నానకు ఆర్డరిచ్చినా రాదు. వంతెనలు పడగొట్టమనీ, నూనె బావులు పట్టుకోమని అన్నా నియంతలాగా అనగలవు. ''రావచ్చు. రానిస్తాను'' అని పిన్నికి సంజయ రాయబారం లాగా పంపినా, ధృతరాష్ట్రుడలాగే చేశాడుగా, పిన్ని రాదు. మెరికల్లాంటి వారిని వాళ్లింటి మీదికి దాడి చేయించావుగా. కూలీ జనం వాడే నింద్యగ్రామ్యం వాడి పిన్నిని రంజింపజేశారు నీ మెరికలు. కర్మలంత ఘనంగా పెళ్లిలాగా చేయాలన్నా అప్పుల్లో పీకలవరకూ కూరుకున్నవాడేగా తగలేస్తే చాలదా అంటే చిన్నాన్న నవ్వి 'పెళ్లీ చావూ ఒకటే''నని అలా చేస్తారు అని నవ్వాడు. పెళ్లి అంటే చచ్చినట్టు పడివుండటమేనని అమ్మ నిరూపించెగా. ఆమె మాట నెగ్గనే లేదే. '' ఇద్దరం జబ్బు పడ్డాం. చేయలేక పోతున్నాం. తోటికోడల్ని తెచ్చుకుందాం. తోడుగా వుంటుంది. పనిమంతురాలూ నెమ్మదస్తురాలని పేరు తెచ్చుకున్నది'' అని మానవత్త్వం గుర్తు చేస్తే ''మేనగోడలౌతుందిట మామగారికి'' అని నవ్వినా విన్నావా ''యెలా ప్రేమట.

తెచ్చుకుంటావేణీ? నలుగురు నవ్వరా? రీతి రివాజులూ శాస్త్రమూ పాటించని మనిషిని రానిచ్చావే దుర్గా అనరా?'' అన్నావు నియంతలాగా. నీకన్న దొడ్లో పాకవేసుకుని పనిచేసిపెడుతున్న యానాది సుబ్బి నయం. గంగిగోవులాటిదది. వెళ్లి పిన్నికి కానుకలిచ్చి దీవించి వచ్చింది. నీతోనూ అన్నది'' యింటికి తెచ్చుకోండి అమ్మగారూ. ఒక్కొక్కటే పోతున్నాయి. వచ్చి పోయేవారు. యెవర్నన్నగలం?'' అంటే దాని కులమూ జన్మా చూశావు గానీ మామ్మా లక్షలు విలువజేసే దాని మాటలు చెవిన వేసుకున్నావా? ఇగో. లేడీ కంస. ''యివాళ తీసుకురా తెచ్చి నా పాదాల వద్ద పడేయి. దయగానే చూస్తా. నేనేమీ అననే లేదు. మీ నాన్నా అనలేదు. లోకులు పలుగాకులు. వారు అన్నవన్నీ నిజమా'' అని ధర్మపన్నం వల్లిస్తే ఋషిపత్నివని నమ్ముతామా? చిన్న చిన్నానా స్త్రీనీ అవమానించావు. అదంతా యిల్లు నీ పేరవుండటం వల్లే. నారదుడు వెళ్తుంటే గూటిలో పిచ్చుక చూసి గేలిచేసి తిట్టిందట. వెనక్కి తిరిగి రెట్ట వేసిందిట. నారదుడు గూటి దగ్గరకెళ్లి పిచ్చుకను పక్కకు నెట్టి గూటిలో చేయిబెట్టి చూస్తే ఓ బేడా చేతికి తాకిందిట. దాన్ని తీసి దూరంగా పారేశాడుట నారదుడు. పిచ్చుక పులుకూ పులుకూ చూసిందట. ఇంకేమనలేదు నారదుడిని.

''అదేం పెళ్లీ? అది చెల్లుతుందా? డబ్బు దాని మొహాన పారేసి పొమ్మనండి. అదేం పార్టీ? ప్రాణాంతకం పార్టీ. కన్నవారెవరూ? వుంటే అవసరానిక్కాదూ? పార్టీ ఫౌండరూ లైఫ్ ప్రెసిడెంటూ సలహా యిస్తే మాత్రం చేసేసుకోటమే? దరిద్రమూ తలనెప్పీ వెంటబెట్టుకొచ్చినట్టున్నది'' అన్నావు. నీవేమీ తెచ్చావు. దర్పం అహంతో వచ్చావంతేనా? గురువునని యింట్లో చేరి మా నాన్నను జలగలా పట్టుకున్న గుండును ఒక్కమాటనవేం? మీరిద్దరూ ఓ ముఠా. ఆ గుండునూ నీ పులిపంజాతో కొట్టి కైలాసానికి పంపలేకపోతున్నావేం? మా అమ్మల్లే నోట్లో నాలుక లేని మనిషి కాదా గుండు? తోడేలు నోరూ నక్క చూపూ. విషప్పుచ్చ. కొడుకు యెన్నికలకు నిలబడి గెలుస్తాడని ప్రత్యర్థులు యెత్తుకు పోయి యెక్కడో దాచారుట. కిరాయి గూండాలే చెప్పారట ఆ సువార్త. కొడుకులంటే చాలా

పిల్లలే ఆస్తిట. ఆస్తిపోతే పోయిందనుకుంటే పిల్లలిట్లా అయినారే అని విచారంట. కన్నబిడ్డ క్షేమం కోసమని ఓ పూట అన్నం మానేసి పెద్దపెద్ద మినపరొట్టెలు రెండు, గిన్నెడు పాయసం పప్పుండలు రెండు పొట్టలోకి పోనిచ్చి త్రేనుస్తే బిడ్డ క్షేమంగా తిరిగి వచ్చి మంత్రి అవుతాడుట. నీ ముద్దుల ఎనిమిక్ గారాలకుందు యింకో రెండాకులెక్కువే చదివింది. హరీమని పూలరథమెక్కిపోయిందిట. ఈమెకి షాక్ తాకిందిట. అన్నం వండానని మర్చిపోయి మళ్లా వండుతుందిట. వదినేమో రోగిష్ఠి. డెలివరీ యింకా నెలుందనగానే యేడుపులూ పెడబొబ్బలు పెట్టి నెప్పీ నెప్పీ అంటుందిట. తాను బిడ్డ బయటకొస్తున్నా యేడవదుట''.

కిటికీలోంచి సీను చూసి నవ్వు దాచుకుని మళ్లా తమ పన్లోకి వెళ్లిపోయారు.

వెనుక వైపు యింట్లో వున్న శంభుశాస్త్రి సంధ్యవారుస్తూ గాయత్రిని గురించి కొంగ జపం చేస్తూ యీ రగడ వింటూనే వున్నాడు.

''చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా. యెవరి మాటా నెగ్గకుండా, యెవరూ నోరెత్తకుండా చేసినట్లు లేదూ యివాళ? దూర్వాసుడి మీదికి సుదర్శన చక్రం వచ్చిందిలాగే'' అంటూ వేళ్ల మీద గీతలు తాకుతూ లెక్కిస్తున్నాడు.

త్యాగరాజస్వామి ధేనుకరాగంలో, ''తెలియరేరు రామభక్తి మార్గమునూ'' అని గానంచేశారు. ''వేగిలేచి నీట మునిగి, భూతి బూసి, వేళ్లు పైకితీసి లెక్కబెట్టితే బాగ పైకమార్జన లోలురైరే గానీ తెలియలేరు'' అని హాస్యం జోడించారు గానంలో.

శంభుశాస్త్రి ప్లీడరుగుమాస్తా. సరిగ్గా అలాగే చేస్తాడు పైకమార్జనలోలుడు. కోర్టు వ్యవహారాలు కొట్టిన పిండి.

'' ఆ గుండు గురువు సంగతి మేమే తేలుస్తాం. ఉద్వాసన టెక్నిక్ తెలుసు. నీకు కంపెనీ వుండదని చూస్తున్నాం నియంత మామ్మా. నంబర్ వన్ గ్రాండ్ ఛైల్డుని డడ్డు చేసి నీవు సెలెక్టు చేసిన తిప్పులాడికే వాడిచేత మూడుముళ్లూ వేయించావా? పగడం కలర్లో వుండి తిప్పుకుంటూ నడిస్తే చాలు. అత్త కన్న యే

విషయంలో గొప్పదీ? నార్మల్ డెలివరీ కానిచ్చిందా? గొప్పగా పెద్దాపరేషన్ కావాలని బాగా వదిల్చింది. వంట నీవూ, పై పని మా అమ్మా చేస్తుంటే యీామె యేం చేస్తున్నది? సంగీతం నేరుస్తున్నాదెందుకో. కచేరీ చేస్తుందా సంగీతమేమోగాని సైకాలజీ బాగా వచ్చు. సంగీతం మేష్టర్ని చీకట్లో చితకబాది చమ్డాలూడదీశారు. అందుకే రావటం లేదు కళ్లు శిష్యురాలి మీదే వుంచే ఛాన్సు పోయింది. వేరు పడితే మేలురా మగడా అని పాట. వేలుమీద గోరు మొలిచింది చూడూ అని చరణం. మేము తన వెంటపడ్డామని చిట్ట స్వరం అల్లింది అని నవ్వుతున్నాడో స్తంభం. నాలుగో స్తంభం అందుకుని, ''దాని తండ్రి మాంత్రికుడు. తాంత్రికులతో గాఢమైత్రి. వాళ్లతో చెప్పి, కోళ్లూ గొర్రెలూ బలులిప్పించి చేతబడి చేస్తాడు. మా అమ్మని మూడురోజుల్లో పైకి తోలిందలాగే. నేలమీద బియ్యప్పిండితో బొమ్మవేసి, గుండె వుండేచోట పెద్ద మేకు కొట్టి తంత్రం నడిపిస్తూ మంత్రాలు చదువుతాడు. అందుకే మా అమ్మకు మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చిపోయింది. చెల్లెమ్మకు కులదేవతపూని, గణం పెరిగినప్పుడంతా చెప్పి పడిపోయింది చెల్లెమ్మ''.

ఇద్దరిల్లాండ్రు చెవులలలో వేళ్లుంచుకుని చొరవగా లోపలికొచ్చారు. పిట్టగోడమీదినించి చూస్తే పెద్ద అరటి గెల, గజనిమ్మ విరగకాసింది. పెద్దగజి నిమ్మ పళ్లు కనిపించాయి. దుర్గాంబను బెల్లించి తెచ్చుకోవాలి.

డేకుతూ వెళ్తున్న దుర్గాంబను అలాగ్గా నేర్పుగా యెత్తి తీసికెళ్లి మంచం మీదుంచారు.

'హద్దూ పద్దూ లేదర్రా నాయనలూ? నాలిక్కు నరం లేదని బుజావు చేస్తున్నారే! పెద్దదయింది. ఓనాడు మీ అందర్నీ కూచోబెట్టి తరిపి దూడల్ని మేపినట్టు మేపింది. ఉన్న కానీ యేదో మీ కోసమే ఖర్చు చేసింది. లేవలేక బిక్క చచ్చి, ప్రేమ చావకపడి వూరుకుంటున్నది. ''మామ్మా యాత్రలకెళ్తున్నట్టున్నావు బంధువులతో. డబ్బాలనిండా, జంతికలు, పాలకాయలు, అరిశలు చేసిపెట్టిపో. అమ్మ ఆయాసపడుతూ యేమీ చేయదు. బడినుంచిరాగానే తినాలి. కాఫీ మేమే

తెస్తాం'' అని పురమాయిస్తే మా వంక మురుపుగా చూస్తూ, తల్లిని కాకుండా తననే ఆపేక్షగా చూస్తున్నారనుకున్నది. మగసిరియేదీ? వుద్యోగాలు మానేయటం చిటికెల మీద చేస్తారు. మరోటి చూసుకోటం చాతగాదు. యెవరైనా చూసి పెట్టాలి'' అని చేతులూ కొప్పులూ తిప్పుతూ మీదికొస్తుంటే మనమలు అచోటు వదిలి వెళ్లిపోయారు.

''నసాళానికంటేట్టు అంటించలేవేం అత్తా? అన్నీ పడిచూస్తూ కూచుంటావేం?'' అని యిచ్చకాలాడుతూ, అరిటికాయలు, గజనిమ్మ పళ్ళు. అరిటాకులు, నువ్వు పప్పుగొట్టం కందదూంపా అడిగి తీసుకున్నారు.

''మీరే అన్నారుగా అమ్మా. వాళ్లెన్ని అన్నా నాకు వాళ్ల మీద ప్రేమ చస్తుందా? నేను పెంచిన వాళ్లేగా'' అన్నది దుర్గాంబ. దర్పం, బింకం వెల్లడైనై.

''కోడలి నోరు మూయించేదానివే'' అని వినపడకుండా గొణుగుతూ వెళ్లిపోయారు.

## 10

వంట యింటి ముందున్న పంచలో మంచం మీద కూచుని దుర్గాంబ వంటామె దినచర్య చూసి యేవగించుకున్నది. నియంతాయె.

వచ్చేప్పుడు మనమరాలినో మనుమడినో వెంటతెచ్చుకుంటుంది. వాళ్లెందుకూ అంటే 'పని అందుకుంటారు'' అని జవాబు '' ఒక్కత్తెనే అన్ని పన్లూ చేయలేను. చిన్నముండనా చితక ముండనా నీ యీడే. అత్తెసర్లు పెట్టాలైపాయె. సాయంకాలమూ తప్పదైపాయె. పప్పు రుబ్బి యివ్వాలి నీకు'' అని పనస చదువుతుంది తల విదిలిస్తూ. రాగానే వేడి కాఫీ అందిస్తే తాగి వేడినీళ్లతో స్నానం. చన్నీళ్లు పడవుట. వళ్లు నెప్పులట. పొద్దున టిఫిన్ మనమలే చేసుకుతిని, బొచ్చెలనీ దొడ్లో పడేసి చేతులు కడుక్కుని విదిలిస్తే ఆ నీటిచుక్కలు తన మీద పడతై. క్షరసాయంతోనూ లేవలేని స్థితి కొచ్చింది నియంత. ప్లీహంలో సన్నని నెప్పి, తగ్గని యిగో. పొట్ట వూదినట్టు వస్తున్నది. వంటమనిషినేడిపించ సాగింది. వంటమనిషీ యిరిటేట్ చేస్తుంది. వడ్డన చేసి నేతిగిన్నె పట్టుకు నిలబడి, అన్నది.

''అదేమిట్రా రాఘువా. పచ్చడి కిందబడేశావేం?''

రఘు నవ్వుతూ, ''యెక్కడేయాలి? నీ మొహాన వేయాలా ఈమాటా పనిచేస్తా. అన్నిటిలోనూ యింగువ. ఇంగువ వేసి అన్నం వండుతావేమో'' అన్నాడు.

మరోరోజు, ''సాంబీ, నా వంటకి వంక పెడుతున్నావే! గొప్ప యిళ్లలో వండి వడ్డించాన్నేను. యెవరూ నోరెత్తేవారు గాదు. మీ నాన్న వంకపెడుతున్నాడా? పెట్టిందేదో తిని పోవటంలా? యెంత పొగరు రెండు పూటలా వంకలు పెడుతున్నావే. పెళ్లాడు. పెళ్లాం రుచిగా వండి వడ్డిస్తుంది. పెళ్లాం పిల్లల్ని పోషించాలని భయంగాబోలు. నువ్వు వెలిగించే వుద్యోగమేమిటి? కలక్టరా కమీషనరా'' అన్నది నడ్డిన చెయ్యిపెట్టుకు నిలబడి.

''నా పేరు సాంబశివరావు. అది మా పెద్ద తాతగారి పేరు. ముక్కల పులుసులో వెల్లుల్లి వేయరే? నీకు వెల్లుల్లి యెక్కడిదసలు? వచ్చేప్పుడు యింటినుంచి తెచ్చుకుంటావా? మామ్మగానీ, అమ్మగానీ, నీరుల్లి గానీ, వెల్లుల్లి గానీ యేనాడు వాడలేదు వంటలో'' అంటూనే లేచాడు, అక్కడున్న పులుసు గిన్నె యెత్తి వంటామె మీద పోశాడు. వేడి పులుసు. ఆమె కేకలు విన్నది దుర్గాంబ. లేవలేదు''. నయమే నా మీద పొయ్యలేదు అని గొణుక్కున్నది. ''మా నాన్నతో కుమ్మక్కయి మమ్మల్ని ఆడిస్తున్నావే? యెవరూ అందలేదా? ఆయన్ని పట్టాలని చూచేవు. ఇది వరకొకామె ఠారెత్తి పారిపోయింది. బిహేవ్ యువర్సెల్ఫ్'' అంటుంటే తక్కినవాళ్లు పకాపకనవ్వారు.

ఆ మరునాడు వంటామె రాలేదు. వార్తా లేదు. మనమలే పొద్దున్నే స్నానం చేసి కాఫీ ఫలహారాలు కానిచ్చి సలహాలడుగుతూ వంటచేసి, తండ్రి చేత భోజనం తినిపించి పంపేశారు. పళ్లెంలో అరిటాకు వేసి అన్నం వడ్డించి దుర్గాంబ కెదురుగా బల్లమీదుంచారు. నేయీ పెరుగు మంచినీళ్ల చెంబు మరో బల్ల మీదుంచి వెళ్లిపోయారు. ఒకడికి పక్కపట్నంలో జాబ్ రాత్రికి వచ్చేస్తాడు. మరొకడికి కలెక్టరాఫీసులో జాబ్. ఇంకోడు జూనియర్ కాలేజ్ నడుపుతున్నాడు. యెవరికీ

తీరికలేదు.

నాలుగోనాడు వంటావె మనుమడు యెనిమిదేళ్ల బ్బాయి బిక్కుబిక్కుమంటూ వచ్చి, ''మా మామ్మ యింటికి వస్తుంటే దోవలో ప్రమాదానికి గురైంది. కాలు విరిగింది. రాలేదిహ. జీతమిప్పించుక రమ్మన్నది'' అన్నాడు చేతులు కట్టుకు నిలబడి.

దుర్గాంబ తానున్న చోటునించే అరిచింది. ''అన్నీ విస్తళ్లల్లో పొట్లాలు కట్టి తీసికెళ్లేది రెండుపూటలా. తిన్నంత తిను. తీసికెళ్లకు అంటే నన్ను ఖాతరు చేయక పోగా, అందిన గిన్నె చెంబూ బుట్టలో పెట్టుకుపోతే యేమౌతుందీ''. ఫస్ట్ జనరల్ పూర్తి జీతమిచ్చి పిల్లవాడిని పంపేయటము కంటబడింది నియంతకి.

''పదో తారీకేగా? ఇంకా యిరవై రోజులు చేయాలి వంట. అప్పుడే నెలజీతమివ్వాలి. అలా విరజిమ్ముతారు గనకనే వాళ్లకంత పొగరెక్కుతుంది'' అని గొణిగింది.

హిట్లర్ నియంతకి చివరిరోజుల్లో గూడా, అనుయాయులూ, భయమూ భక్తీగల జనరల్సూ దగ్గరున్నారు.

అలాగే దుర్గాంబ నియంత ఫస్ట్ జనరల్ భక్తితో మరో వంటమనిషిని ఎంగేజ్ చేశాడు. పిల్లలు అవస్థపడుతారనీ తలచాడు. రెండవ జనరల్ స్వామి వచ్చి తల్లి అవస్థ చూసి, చక్రాల బండి చేయించి తల్లి కిచ్చాడు. దాన్ని వాడుకోటం నేర్పాడు.

దుర్గాంబ ప్రాణం తెరిపినబడింది. మంచం మీదినించి బండి మీదికి జరిగి, చక్రం తిప్పితే బండి పొట్టి అవుతుంది. కుంపటి మీద పెనంపెట్టి, నేయీ అట్లకాడా పళ్లెం ముంతా రొట్టె పిండీ మంచినీళ్ల చెంబు దగ్గరగా వుంచితే, రాత్రి ఫలహారం కానిచ్చి మజ్జిగ తాగి, చేయీ మూతీ కడుక్కుని మళ్లీ చక్రం తిప్పి పైకి బండిలేపి చక్రాలు నెట్టితే మంచం దగ్గరకి పోతుంది. రబ్బరు చక్రాల బండి. మంచం మీద చేరి బ్రేవ్‌మని త్రేనుస్తుంది. మీట నొక్కితే బండి కదలదు. దగ్గర్లోనే వుంటుంది కర్ర. వంటామె అన్నీ క్లియర్ చేస్తుంది.

వంటామె పేరు అన్నపూర్ణ. నలభై అయిదేళ్లుండచ్చు. తనకు ముప్పై యేళ్లే అంటుంది. యజమానురాలు దుర్గాంబని అత్తా, అత్తగారూ, అత్తయ్యా, అత్తయ్య గారూ అని సంభోధిస్తుంది. వయ్యారం, కులుకు, కాళ్లు యెత్తెత్తి వేస్తూ, కూచిపూడి భంగిమలు పడుతుంది. తరచూ తిప్పుతూ పనిచేస్తుంది. పిల్లలు యెంజాయ్ చేస్తూనే, లొడపత్రి అని నిక్‌నేమ్ పెట్టారు. లొడలొడా వాగుతుందిట. దుర్గాంబ మెప్పుకోసం తడిబట్టతోనే వంటా వడ్డనా. ఫస్ట్ జనరల్‌కి వడ్డించి తలుపు చాటున నించుంటుంది. చుట్టాలు పక్కాలు వస్తే పొంచుండి వింటుంది. అదంతా ఆచారమేనా నటిస్తున్నదా అని చూస్తుంది దుర్గాంబ. మారు వడ్డనా, నేయి వేయటం చేస్తూనే తలుపుచాటుకు పోతుంది. మొత్తానికి పొత్తు కలిసింది.

''అవునత్తా అలా చెప్పుకున్నారేం? మీ రెండో జనరల్ యెవత్తెనో చేరదీసి, పిల్లల్ని గని సాకుతున్నాడట. మాట పట్టింపులొచ్చి మీరు ''నే పట్టిన కుందేటికి మూడే కాళ్లంటే, రెండో జనరల్ ''నేను కుందేటి కొమ్ము సాధిస్తా'' అన్నాడట. మామగారికా మనిషి మేనగోడలౌతుందిట. ఆస్తులు పంచుకుని నాల్గుతరాల క్రితం విడిపోయి దాయాదులైనారట అన్నదమ్ములు. కాసేపు తల్లిని తప్పుపట్టీ మరి కాసేపు అమ్మాయిని తప్పుపట్టీ యేదీ జరక్కుండా మొగ్గలోనే తుంచేసి, వాళ్లింటి మీదికి దాడీ జరిపించారుట''.

ఆ టాపిక్ మార్చాలని దుర్గాంబ ''యెవరే నీ కోసం వచ్చి వెళ్లారు అన్నూ? యేమంటాడూ? ఇంటికి వచ్చేయమంటాడా? అప్పుడే వెళ్లిపోయాడే? అన్నం పెట్టకపోయినా? మనమడా?'' అని అడిగింది.

''పోనీ అలానే అందామత్తగారూ ''తనకవమానంగా వున్నదిట ఆఫీసులో అవమానిస్తున్నారుట. అందుకని వాళ్లనాన్న నన్ను వుద్యోగం మానేసి వచ్చేయమని కబురుపెట్టాడు. వంటామె కొడుకు అని అసలు పేరు పోయేట్టు చేస్తున్నారుట''. కళ్లు తడి అయితే పమిట కొంగుతో అద్దుకుని చీదింది. ముక్కుపుటాలదిరాయి. ముక్కు యెర్రబడింది. పెదిమలు నొక్కిపట్టి యేడుపు ఆపుకున్నది అన్నపూర్ణ.

''మరిదేనికి కుదిరావసలూ'' అని మంద్రస్వరంతో దీర్ఘం తీస్తూ అడిగింది దుర్గాంబ. ''జీతం హెచ్చిస్తాం. వెళ్లవోకు అనాలనేమో యీ నాటకం'' అనుకున్నది మనస్సులో. యెవరూ తనతో మాట్లాడేవారే లేరు. పలకరించేవారే లేరు పొద్దే బోవటం లేదు. వేరింటికాపరం వెలిగిస్తున్న మనమరాలొస్తుంది. కర్తవ్య పాలన చేస్తున్నట్టు, స్నానం చేయించి తుడిచి పొడిబట్ట కట్టి, బట్ట వుతికి ఆరేసిపోతుంది. అన్నపూర్ణా సాయపడుతుంది. పొట్టేమో పెద్దదౌతూనే వున్నది.

''ముక్కులో ముక్కపుడక దగ్గర్నించి, వంటి మీద బంగారం పెళ్లినాడు పుట్టింటారు పెట్టిందే. సాలంకృత కన్యాదానమే చేశాడు మా నాన్న. పౌరోహిత్యం చేశాడు మగడు. నానమ్మ ముద్దుగా యిచ్చిన యెకరమూ అమ్మేశారు తండ్రీకొడుకులు. అదేదో జబ్బు వచ్చింది మగనికి. వైద్యం చేయించాలిగా. కొడుకు చదువై వుద్యోగమొచ్చేప్పటికి, నేను బోడెమ్మనైనా. వుద్యోగం వరించగానే పిల్లనిస్తామని వెంటబడ్డారు. పెళ్లి చూపులనాడే మావాడితో అన్నాన్నేను. ''పిల్లకు పిచ్చి వున్నట్టున్నదిరా సుబ్బిగా'' మా వాడు వినలేదు. ఒప్పేసుకున్నాడు. పిల్ల రంభట. చదువూ సంగీతం కాక వుద్యోగం వెలిగిస్తున్నదిట. సంగీతం టీచర్ హైస్కూల్లో. సంగీతమేమో నేను వినలేదు గానీ అత్తగారూ, నోరు విప్పిందంటే గంటల తరబడి తెగేట్టు తిడుతుంది. పడిపోతుంది. నా ముద్దుల కొడుకుది జాలిగుండె. శీతలోపచారాలు చేసి పక్కమీదుంచి విసురుతాడు మందిస్తాడు. కళ్లు దెరిచి నవ్వి తగ్గింది అంటుంది. మావాడి మొహం వికసిస్తుంది. నేనే దానికీ, దొడ్లో గొడ్డుకీ నోటినించి రెండోదాని వరకూ చేయాలి కొడుకుని కనాలిట. స్ట్రెస్ భరించలేదుట. వుద్యోగానికి తిలోదకాలిచ్చింది. పోనీమంటే బట్టలు కొనుక్కోమని గానీ, వ్రతం చేసుకోమనిగానీ యాత్ర చేసిరా అని గానీ కొడుకు గానీ కోడలమ్మగానీ పైసారాల్చరు''

''ధణు అంటే?'' అనడిగింది దుర్గాంబ.

''దమనులు సిరలు అని ఒంట్లో వుంటాయిట. అవి తెగేదాకా అన్నమాట''.

''స్ట్రెస్ అంటే?''

''శరీరాయాసం. పని వత్తిడి''

''చెప్పినది నిజమేనందాము. ఆశువుగా కథలల్లటంలో ప్రతిభ జన్మతః వచ్చి వుండాలి నీకు. నిద్ర చెడగొడుతూ బ్రాహ్మీ ముహూర్తానికే లేచి, ''హేరామ హేకృష్ణహే జగత్రయి గురో, హే పుండరీ కాక్ష యిహసముక్తిష్ఠ! ప్రాచీది గంగానా పరిహసతి శ్రీకృష్ణ!'' అని పాడుతూ స్నానం. నాలుగిళ్లలో పనికి కుదిరిన సుబ్బికీ నిద్రచాలటం లేదు. అదంతా భక్తేనందామా? రాత్రికి యింటికెందుకెళ్లవు? మా నాన్న భాష్యం విన్నంతసేపూ వింటావు. వేదాంత పంచదశి వింటావు కన్నార్పకుండా మా నాన్ననే చూస్తూ. ఆయన బొందితో కైలాసానికి వెళ్తాడట. నువ్వూ ఆయన బొందితో ఆయనపోయే చోటుకి నీ బొందితో పోతావా? ఆయన వినేవి నీ కర్థమవుతయ్యా? చాలాసేపు మేలుకుంటున్నావే? యేపాటి గుంజుతున్నావు? మా యింటి సంగతులు నీకెందుకు? యూ ఆరె న్యూసెన్సు''.

అన్నపూర్ణ లేచి నిలబడి కొంగుబిగించి, చాంద్ బీబీ రాణీ పోజులో కత్తిదూసి పట్టుకున్నట్టు చూస్తూ మాటల యీటెలు విసరసాగింది.

'పెళ్లాడవెందుకనీ? పెళ్లాం లేదు కనకనే నీకూ నిద్రబట్టదు. మంచి నిద్రబోతే అన్నీ వినబడతయ్యా? బిపి వుందేమో? అది నిద్రబట్ట నివ్వదు. పిల్లనిస్తామని రాగానే పెళ్లాడేసేయ్. కుటుంబీకుడవుగా. అన్నా వదినలను తోలేశారు. పెద్దవాళ్లను తిడితే ఆయుక్షీణం. మామ్మనెట్లా నొవ్వనాడుతారు? యేపాటిదీ సంపాదన? కూటికీ గుడ్డలకీ, సినిమాలకీ సిగరెట్లకీ చాలేదేనా?''

''గాండీవం మరొకరికిమ్మని అన్నవారిని చంపుతానని ప్రతిజ్ఞ పట్టాను బావా! కృష్ణపరమాత్మా యెలా? ఈ ధర్మజుడు '' ఆ గాండీవమెందుకు కర్ణుని చంపకుండా శిబిరానికి రావటానికా? వాడు నన్ను యుద్ధభూమి మీద నొవ్వనాడి తరిమేశాడు. ఆ గాండీవం కృష్ణునికిచ్చేయి'' అన్నాడు. నువూ విన్నావు అని అర్జునుడుతన బాధ పరమాత్మతో చెపితే,

''నీకన్న పెద్దవాళ్లను దూషిస్తే చంపినట్టే. దెప్పి తిట్టిపోశావు అన్నను. నీ మూలకంగా ద్రౌపది సభలో కీడ్వబడింది. నా కొడుకు అభిమన్యుని చావుకి నీవే కారణం. వెళ్లను. మా నాన్న వెళ్లద్దన్నాడన్నా వినలేదు నువ్వు. పంపావు. అర్జునా! బావా. పోదాం రా'' అని తీసికెళ్లాడు. అంత పౌరుషం గల వాళ్లైతే, పెద్ద వుద్యోగం మరో వూళ్లో సంపాయించి, తల్లిని యీ బందికానా నించి విడుదల చేయించి తీసికెళ్లకపోయారూ? చాతకాలేదా? పెళ్లాం తన కాళ్లు గడిగి దాహం పుచ్చుకోమంటుందని భయం''.

''నిన్ను పంపించక పోతే చూస్కో'' అన్నాడు ప్రత్యర్థి.

''నీ తరంగాదు మన్మథా'' అని దుర్గాంబవేపు తిరిగి చేతులు జాడిస్తూ అన్నది అన్నపూర్ణ'' అత్తగారూ ''రెండో కోడలని బిరుదిచ్చి, కిరీటం పెట్టిస్తాను. కరపత్రాలు పంచుతాము'' అని బురిడీ వేసి, రెండో ఆమెను, శాస్త్రీయంగా దాసిగా, రెండో జనరల్ మీద వత్తిడి తెచ్చి, ''మేమేమి అనలేదని బూకరించి పిలిపించండత్తా'' అలా అంటూనే కన్నీళ్లు జలజారాలుస్తూ, '' ఆ అమ్మాయిని వంచించి తెస్తే వచ్చిపోయే చుట్టాలకూ పక్కాలకూ అత్తెసర్లు పెట్టి వండి వడ్డిస్తుందా అమ్మాయి'' కళ్లు యెర్రబడి పెదిమల దరగా తన కత్తికి రెండువేపులా పదునున్నదని ఋజువు చేస్తూ అన్నపూర్ణ దుర్గాంబ మీదికి అస్త్రాలు వదలటం మొదలెట్టింది.

''అవునా అత్తయ్యా! నీ కూతురుకేమిటి రోగం? వస్తూనే కొంగు పరుచుకు పడుకుంటుంది నేలమీద? ఎపిలెప్సియా? యెనీమియా? నాకు గుర్తు లేదు, ఆమె మనుమరాలే చెప్పింది నవ్వుతూ. నొల్లుకుపోవటానికీ, అన్నీ కొనిపించుకు పోవటానికీ, యే రోగం లేదా? మందుల ఖర్చులు కూడి వస్తాయి. పెట్టిన అప్పడాలూ, వూరగాయలు, ఒరుగులు తీసికెళ్తే అన్నంలోకి ఆదరువులు చేయక్కర్లా యింటి దగ్గర. పట్టు చీరా రైకా తాను కొనుక్కోక్కర్లా'' అని పనస చదువుతున్నది.

మరో యోధుడొచ్చాడున్న వాడికి సాయం. కొత్త పరికరాలతో వచ్చాడు యుద్ధరంగానికి.

''మా మామ్మ నీకు అత్తగారెట్లా అయిందీ? మా నాన్న నీకు బావగారౌతాడా? నువ్వు పిలిపించుకోమంటున్నావే ఆమె రాదు. ఫోన్ చేసి చెప్పేస్తాం యీ నియంత కుచ్ఛితం, డామినేషన్. అధికారం డబ్బూ యివ్వరని చెప్పేస్తాం. రాదు'' అని పకాపక నవ్వాడు.

''నేను మీకు అడ్డుగా వున్నట్టున్నానే చూస్తే? యజమాని నుంచి లాగుతే లాగుతా. వళ్లొంచి చేస్తున్నాను. అది చెమటోడ్చి సంపాదించిందా? మేజర్లై పెద్ద వారైన అయన వద్ద నుంచి మీరు లాగచ్చా? అయనంత యెత్తూ యెదిగారు. ఆయన చెప్పుల్లోకి మీ పాదాలు సరిపోతాయి. మరెవరూ ఆయన సొమ్ము తినగూడదనే యింట్లోంచి పోరు'' అని కూలబడి పెద్దపెట్టున యేడవసాగింది. దొమ్మీ జరుగుతున్నదేమో అనీ, పాకం ముదిరిందేమో అనీ యిరుగూ పొరుగు వచ్చారు. తండ్రికి కబురంపారు.

రాత్రికి పెద్దదైంది తగాదా. ''దీన్నివాళే యిప్పుడే తోలేస్తావా లేదా? దీనికింత అధికారమెవరిచ్చారు? నువేనా? మీ అమ్మ నియంతా? మీరిద్దరూ అంతగా ఆమెమీద ఆధారపడి వుంటే, తన్ని తగలేయలేకపోతే భాగాలు పంచేయి. పంచకపోతే స్త్రీ ధనమని కూతురి పేర రాసి, మాకు నిలువనీడలేకుండా చేస్తుంది. భూమి అమ్మేశారు మీరిద్దరు. మర్యాదలు, కార్యకరామతులు, కర్మకాండలు భూమిని తినేశాయి. ఇది తాతయ్య కట్టిన యిల్లు. ఆయన కాయకష్టం. మాకే చెందాలి. మా అమ్మని అణిచి వుంచి రాజ్యమేలింది చాలదూ? మేము తల్లికి చెరవకుండా చేసింది. ఈ శిథిల సామ్రాజ్యం యేలటానికీ, తిరుగుబాట్లు అణచటానికీ యెవరూ రారు. భాగాలు పంచటమిష్టం లేకపోతే ధరకట్టి మా వంతు డబ్బు పంచేయి పోతాం. మీ అమ్మను పూజించుకుంటూ, వంటలక్కని ముద్దు చేసుకో. వాళ్లిద్దరూ వత్తాసూ నీకు. మీరిద్దరూ ఆమెకి వత్తాసు పలుకుతూ మద్దతిస్తూ మమ్మల్ని అవమానించమని ప్రోత్సహిస్తున్నారు'' అన్నాడు మరో

యోధుడు శ్యామకృష్ణ.

11

హిట్లరైట్ దుర్గాంబ యెదురు చెప్పలేని, ఒక్కమాట అనలేని స్థితికి వచ్చేసింది.

''మంచం వద్దు. నన్ను యెత్తలేరు. నేనా బండి మీదికి జరగలేను. కూచుని రొట్టెలూ వేసుకోలేను. ముందీ సలపరింత, నెప్పీ తగ్గితే సంతోషిస్తా. ప్రాణం పోయినా విచారం లేదు. చిరిచాప చాలు. తలగడా కూడా వద్దు'' అన్నది మంద్రస్వరంతో దీర్ఘం తీస్తూ.

ఫోన్ కాల్ అందుతూనే రెండవ జనరల్ ఘనవైద్యుడు స్పెషలిస్టుతో సహా వచ్చి వాలాడు. చిరిచాపమీద మెత్తని పక్కమీదుంచారు. మనుమరాలూ, అన్నపూర్ణ, మరొక బందుగురాలు, నియంతను వత్తిగిలించి, వేడినీళ్లతో తుడిచి పొడిబట్టతో అద్ది, వుతికిన బట్ట కడతారు. మజ్జిగ తాగిస్తారు.

చెవులు బాగానే పనిచేస్తూనే వున్నాయి నియంతకి. అన్నీ వినబడుతున్నా వూరికే చూస్తూ వుంటుంది దుర్గాంబ నిస్సహాయ దయనీయ స్థితిలో ఉన్నది.

స్పెషలిస్టు డాక్టరూ, రెండవ జనరలూ వీధిలో కొచ్చారు.

''రోజుల్లో కొచ్చేసింది. మీకు మొదటి డాక్టరే చెప్పి వుండాల్సింది. పేరు చెప్పీ లాభం లేదని చెప్పలేదేమో. జబ్బు పేరు దాచే హక్కు డాక్టర్లకున్నది. అబద్ధాలాడే హక్కు వున్నది. నయం చేయగలిగితే చేయాలి. అది తేలటం మొదలై పదిలేకపదిహేనేళ్లయి వుంటుంది. ఆమె దారుఢ్యం రెసిస్ట్ చేసి వుండాలి. ఇరాన్ రాజు షెహ్లావీ జబ్బు యిదే కాసులు గలవాడు గనక అవి వెచ్చించి ఆమెరికా వెళ్లాడు. పరమపద సోపానాలెక్కి వెళ్లినా వదలదది. శస్త్ర చికిత్సకూ లొంగదు. పిలకలేస్తుంది. దయగా చూస్తే చాలు. మందులు ఉపశమనానికే. సింపతీ అప్లై చేయటం బెస్ట్''.

''థాంక్స్ డాక్టర్! మీ సలహా ఫాలో అవుతాము'' అంటూ వెంటవెళ్లి కారు

తలుపుతీసి పట్టుకుని నించున్నాడు సెకండ్ జనరల్. డాక్టరు కూచున్నాక పర్స్ అందించి తలుపు వేశాడు. కారు స్టార్ట్ చేశాడు డ్రైవర్.

ఒక్కొక్క యోధునికీ ఒక్కొక్క యెన్వలప్ అందించాడు రెండవ జనరల్. మీటింగయినప్పటినించి, నేటి వరకు యోధులకొరకు చేసిన ఖర్చుల బిల్లు వున్నాదందులో. ఇంటి పన్ను, నీటిపన్ను, రిపేర్ల బిల్స్, విద్యుత్ బిల్లు. అన్నీ చెల్లించగానే భాగాలు పంచబడును. చెల్లించలేకపోతే తదనంతరమే చెందును. న్యాయవాదుల సంతకాలున్నాయి. న్యాయస్థానంలో తేల్చుకోదలుచుకుంటే తేల్చుకోవచ్చు. వెయిట్ చేయగలిగితే అభ్యంతరం లేదు.

కథా నిలయం
55503
శ్రీకాకుళం